ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

3

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

శనివారం 15 మార్చి 2025





కల్యాణ వైభోగమే!

- వేడుకగా ప్రసన్నుడి వివాహం
- భక్తులతో నిండిన బిలకూటక్షేత్రం

బిట్రగుంట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మంగళవాయిద్యాలు.. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుడి కల్యాణం కనులపండువగా జరిగింది. బిలకూటక్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం మేళతాళాల నడుమ ఉత్సవర్లను ఊరేగింపుగా కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను స్వామివారికి సమర్పించారు. వాటిని కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి, ఈవో రాధాకృష్ణ వేదపండితులకు అందచేశారు. పెద్ద, చిన్న ఉత్సవర్ల కల్యాణ ఉభయకర్తలు బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్ర, కొల్లపనేని వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందచేశారు. శ్రీనివాసుడి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తజనం తరలి వచ్చింది. గోవింద నామస్మరణతో క్షేత్రం మారుమోగి పోయింది. కాగా, రాత్రి స్వామివారు అశ్వావాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు.



శ్రీనివాస కల్యాణం జరుపుతున్న వేదపండితులు, పాల్గొన్న మంత్రి ఆనం, ఎమ్మెల్సీ బీద



ప్రసన్నుడి రథం ముందు గుమికూడిన భక్తజనం



ఆగిపోయిన రథానికి మరమ్మతు చేస్తున్న సాంకేతిక నిపుణులు

పున్నమి వెన్నెల్లో గరుడుడిపై చల్లనయ్య!

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : పున్నమి వెన్నెల్లో రంగనాథ స్వామి తన కిష్టమైన గరుడ్మంతుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. అనంతరం మోహినీ అవతారం, గిన్నెబిక్ష వేడుకలు జరిగాయి. సాయంత్రం మూలవర్లకు, ఆలయానికి విశేష పూలంగిసేవ జరిగింది. గరుడోత్సవం సందర్భంగా శ్రీకృష్ణ చరిత మానస ప్రచార మండలి నూతన శ్వేత ఛత్రాన్ని సమర్పించింది. అనంతరం బంగారు గరుడసేవ వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం) : 6.24

సహరి (ఆదివారం) : 5.01

కదలని రథం!

- చేసిన ప్రయత్నాలన్నీ వృథా

కావలి, (ఆంధ్రజ్యోతి) : ప్రసన్నుడి రథానికి అడుగడుగునా ఆటంకం కలుగుతోంది. శుక్రవారం శ్రీవారి కల్యాణం అనంతరం వధూవరులను రథంలో కొలువుదీర్చి ఊరేగించాల్సి ఉంది. ఈ మేరకు ఉత్సవర్లను కొలువదీర్చాక రథం ముందుకు కదలింది. సుమారు 25 అడుగుల దూరం వచ్చాక కదల్లేదు. చేసిన ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో చివరకు స్వామి, అమ్మవార్లను పల్లకీలో ప్రజలే బోయీలై ఊరేగించారు. కాగా, 2020లో బ్రహ్మోత్సవాలు ప్రారంభానికి ముందు రథం కాలిపోయింది. దీంతో అప్పట్లో రథోత్సవాన్ని రద్దు చేశారు. 2021, 2022లలో పూలరథం తయారు చేసి స్వామివారిని ఊరేగించారు. 2023లో కొత్త రథాన్ని తయారు చేశారు. అయితే, అప్పట్లో రథం ఒరిగిపోయి దెబ్బతిన్నది. 2024లో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి ఉత్సవర్లను ఊరేగించారు. అయితే, ఈ ఏడాది మాత్రం అసలు రథం ముందుకు కదల్లేదు. మరమ్మతుల చేపట్టినా మధ్యలో నిలిచిపోతుందే మోనన్న అనుమానం అందరిలో మెలిగింది. దీంతో పల్లకిలో స్వామివారిని ఊరేగించారు. ఉత్సవాలలో తెలయకుండా మానవ తప్పిదాలు జరుగుతుండటంతో తరచూ రథోత్సవానికి ఆటంకాలు కలుగుతున్నాయని, ఆగమ శాస్త్రం ప్రకారం సరిచేసుకుని భవిష్యత్తులో తప్పులు జరగకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం?

- లస్కర్ల నియామకంలో అంతులేని జాప్యం
- మూడేళ్ల నుంచి వారు లేకుండానే సాగు
- వీరు లేక రెండేళ్ల క్రితం 20 టీఎంసీలు వృథా
- రానున్న సీజన్‌లోనూ పొంచి ఉన్న ప్రమాదం
- ఈ దఫానైనా ఉన్నతాధికారులు కరుణిస్తారా!?

నెల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మారింది.. ప్రజాప్రతినిధులు మారారు.. ఆఖరికి అధికారులు కూడా కొత్తవారు వచ్చారు.. కానీ రైతుల సమస్య మాత్రం కొలిక్కిరాలేదు. గడిచిన మూడేళ్ల నుంచి లస్కర్లు లేక కాలువలపై నీటి యాజమాన్యం చాలా ఇబ్బందిగా మారుతోంది. బ్రిటీషు కాలం నుంచి లస్కర్ల వ్యవస్థ జిల్లాలో సాఫీగా నడుస్తుండగా వైసీపీ ప్రభుత్వం వచ్చి నాశనం చేసింది. 2022 తర్వాత లస్కర్ల నియామానికి అనుమతులు ఇవ్వలేదు. అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా, వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదు. దీని పుణ్యమా అని రూ.వేల కోట్ల విలువైన నీరు లస్కర్ల లేని కారణంగా దుర్వినియోగమైంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా తొలి జడ్పీ సమావేశంలోనే ఈ లస్కర్ల సమస్యపై ఎమ్మెల్యేలు గళం విప్పారు. ఇది జరిగి ఏడు నెలలు గడిచినా సమస్య కొలిక్కి రాలేదు. జిల్లాస్థాయి ఇరిగేషన్ అధికారులు సకాలంలో, సరైన విధంగా ప్రతిపాదనలు పంపడంలో విఫలమవుతుంటే.. రాష్ట్రస్థాయిలో ఉన్న ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఈ ప్రతిపాదనలను ఆమోదించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

రానున్న సీజన్ కీలకం

గతేడాది ప్రకృతి సహకరించడం, ప్రభుత్వ ముందుచూపుతో ప్రాజెక్టుల్లోకి పుష్కలంగా నీరు చేరడంతో ప్రస్తుత రబీ సీజన్‌లో పూర్తి ఆయకట్టుకు నీటి కేటాయింపులు జరిపారు. సోమశిల ప్రాజెక్టు కింద 5.50 లక్షల ఎకరాలు, కండలేరు కింద 2.26 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు జరుగుతోంది. ఈ పంట ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. ఈ నెలాఖరుతో దాదాపుగా వరి కోతలు పూర్తవుతాయని అంచనా. ఏప్రిల్ నుంచి రెండో పంట మొదలవుతుంది. అయితే ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలను బట్టి చూస్తే రానున్న సీజన్ చాలా కీలకంగా మారనుంది. మొదటి పంట మాదిరిగా రెండో పంట సమయంలో పూర్తి ఆయకట్టుకు నీరు అందించడం సాధ్యపడదు. సోమశిల, కండలేరుల కింద 4-5 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందించగలరు. అప్పుడు నీటి యాజమాన్యం చాలా కీలకంగా మారుతుంది. ఒక కాలువ కింద కొంత ఆయకట్టు వరకే నీటి కేటాయింపులు జరిపినా క్షేత్రస్థాయిలోకి వచ్చే సరికి రైతులు అవేవీ పట్టించు కోకుండా సాగు చేసేస్తుంటారు. వీరిని నిలువరించ కుండా నీటిని వదిలేస్తే చివరకు రైతులంతా నష్టపోతారు. ఇక్కడ లస్కర్ల పాత్ర చాలా ముఖ్యం. కాలువల కింద నిర్దేశిత ఆయకట్టుకు మించి సాగు చేయకుండా అవగాహన కల్పించడంలోనూ, నీరు వృథా కాకుండా ఆయకట్టు రైతులకు మాత్రమే అందించడంలో లస్కర్లు కీలకంగా ఉంటారు. నీటి యాజమాన్యం సక్రమంగా చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. రెండేళ్ల క్రితం ఇదే రెండో పంట సీజన్లో లస్కర్లు లేని కారణంగా నీటి యాజమాన్యం సక్రమంగా జరగక 20 టీఎంసీల వరకూ నీరు వృథా అవ్వడం గమనార్హం.



సీజన్‌కు రూ.1.2 కోట్లు ఇవ్వలేరా?

చెరువులు, కాలువల నుంచి నీటిని అవసరం మేరకు చివరి ఆయకట్టు వరకూ విడుదల చేయడంలో క్షేత్రస్థాయిలో లస్కర్లు కీలక పాత్ర పోషిస్తుంటారు. వీరు కాలువలపై తూములు, చెక్కలను అవసరం మేరకు ఎత్తుతూ, దించుతూ ఉంటారు. ఇంతటి కీలకమైన లస్కర్లను గత ప్రభుత్వం పెండింగ్ వేతనాలు కూడా చెల్లించకుండానే తొలగించింది. అప్పటివరకూ జిల్లాలో 230 లస్కర్లు పనిచేస్తున్నారు. వీరికి ఒక సీజన్‌కు ఐదు నెలలు మాత్రమే నెలకు రూ.10,500 చొప్పున వేతనం చెల్లిస్తుంటారు. ఈ లెక్కన ఒక సీజన్‌కు రూ.1.20 కోట్లు మాత్రమే లస్కర్లకు ఖర్చవుతుంది. అయితే వీరు సక్రమమైన నీటి యాజమాన్యం ద్వారా అంతకన్నా అనేక రెట్లు విలువైన నీటిని పొదుపు చేయడంతోపాటు రైతుల ఇబ్బందులను తొలగిస్తుంటారు. అయినా లస్కర్ల నియామకంలో మాత్రం నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ప్రతి సీజన్‌లోనూ కాలువల్లో ఓఅండ్ఎం పనుల కోసం జిల్లాలో సుమారు రూ.30 కోట్ల వరకూ ఖర్చు చేస్తుంటారు. అయితే లస్కర్లకు మాత్రం రూ.1.20 కోట్లు ఇవ్వలేకపోతున్నారు. నిబంధనల ప్రకారం రైతుల నుంచి వసూలు చేసిన శిస్తు నగదుతో లస్కర్లను నియమించుకోవాల్సి ఉంది. కానీ చాలా కాలం నుంచి శిస్తు వసూళ్లు జరగడం లేదు. అయితే రైతుల ప్రయోజనాల దృష్ట్యా మరో హెడ్ కింద లస్కర్ల నియామకానికి అనుమతులు ఇచ్చే అవకాశం ఉన్నా ఆలోచన చేయడం లేదు. మరి రానున్న సీజన్‌కైనా లస్కర్ల నియామకానికి రాష్ట్ర ఉన్నతాధికారులు కరుణిస్తారో.. లేదో.. చూడాలి.

అడుగుతూనే ఉన్నాం

జిల్లాలో లస్కర్ల నియామకానికి గత సీజన్‌కు ముందే ప్రతిపాదనలు పంపాం. అయితే వారిని నియమించుకునే హెడ్ కింద ఫండ్ లేకపోవడంతో అనుమతులు రాలేదు. తర్వాత మరో హెడ్ కిందనైనా అనుమతులు ఇవ్వాలని అడుగుతున్నాం. రానున్న సీజన్‌కు సంబంధించి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

- దేశా నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ

వామ్మో.. స్కూళ్లలో సెగలు

- నేటి నుంచి ఒంటిపూట బడులు
- చెట్ల కింద తరగతులు నిర్వహిస్తే చర్యలు
- ఏప్రిల్‌లో 2వ శనివారం పనిదినం

నెల్లూరు (విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత ఈ ఏడాది ముందుగానే మొదలైంది. గత పది రోజులుగా భారీ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం, సాయంత్రం మినహా ఎవరూ బయటకు రావడం లేదు. మధ్యాహ్నం పూట రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కానీ బడి పిల్లలు మాత్రం బయటకు వెళ్లక తప్పడంలేదు. కాలినడకన, సైకిళ్లమీద బడికి వెళ్లే గ్రామీణ విద్యార్థులు ఎండలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ ఒంటిపూట బడులను ప్రకటించింది. సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న తరుణంలో శనివారం నుంచే 1 తరగతి నుండి 9వతరగతి వరకు అన్ని ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలన్నీ ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలని ఆదేశాలను జారీ అయ్యాయి. టెన్త్ పరీక్షలు జరిగే పాఠశాలలు మాత్రం మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు.

పాఠశాలలకు సూచనలు

అన్ని మేనేజ్‌మెంట్ల పాఠశాలలకు విద్యాశాఖ పలు సూచనలు జారీ చేసినట్లు డీఈఓ ఆర్.బాలాజీ రావు తెలిపారు. విద్యాశాఖ అకడ మిక్ క్యాలెండర్‌ను అనుసరించి పాఠశాల సమయాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఏప్రిల్ నెలలో రెండో శనివారాన్ని పనిదినంగా పరిగణించాలని, అన్ని పాఠశాలల్లో మంచినీటిని ఏర్పాటు చేసుకోవడంతో పాటు శుద్ధి యంత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాలు, చెట్లకింద తరగతులు నిర్వహించకూడదన్నారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, భోజనం అందించాకే విద్యార్థులను ఇళ్లకు పంపించాలని ఆదేశించారు. అదేవిధంగా వేసవి తాపానికి ఎవరైనా గురైతే వెంటనే వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో వైద్య పరీక్షలు చేపట్టడంతోపాటు పాఠశాల పరిసరాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సంబంధిత హెచ్ఎంలు వీటన్నిటిపై దృష్టి సారించాలని ఆదేశించారు.

బీమా.. పాడిరైతుకు ధీమా!

- జిల్లాకు రూ.15 లక్షలు విడుదల
- ఒకసారి చేయిస్తే మూడేళ్ల వరకు వర్తింపు

జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్న పశుపోషకులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. పశు బీమా నమోదుకు చర్యలు చేపట్టడంతో పాటు తన వాటా కింద జిల్లాకు రూ.15లక్షలు విడులయ్యాయి. ఒకసారి పశుబీమా చేయించుకుంటే మూడేళ్ల వరకు వర్తిస్తుందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 57,774 తెల్ల పశువులు, 6,46,088 నల్ల పశువులు, 10,95,197 గొర్రెలు, 1,86,929 మేకలు, 2,969 పందులు ఉన్నాయి. గత వైసీపీ హయాంలో పశునష్ట పరిహారం పథకం తీసుకొచ్చినా పాడిరైతులకు పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. పశువులు అనారోగ్యానికి గురై జబ్బు చేసి చనిపోతే పాడిరైతులు ఎంతో నష్టపోతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం బీమాపై దృష్టి సారించింది. ప్రభుత్వం కొంత ప్రీమియం చెల్లించడంతోపాటు పాడిరైతు కొంత మేర చెల్లింపులు చేయడం ద్వారా ఆ నష్టం నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉండేలా కార్యా చరణ రూపొందించింది. గతేడాది దాదాపు రూ.15.8లక్షలు మంజూరు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మృతి చెందిన పశువులకు కూడా ఇటీవల పరిహారం అందించారు. తాజాగా మరోసారి రూ.15లక్షలు మంజూరయ్యాయి.

ఆవు, గేదె జాతి పశువులకు..

మేలు జాతి పశువుకు రూ.30వేలు, నాటు పశువుకు రూ.15వేలు, ఒకటిన్నర సంవత్సరంపైబడిన మేలుజాతి ఎద్దులు, దున్నలకు రూ.30వేలు, రెండేళ్ల పైబడిన నాటు ఎద్దులు, దున్నలకు రూ.15వేలు బీమా వర్తిస్తుంది. ఇందులో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీలకు 80శాతం రాయితీ లభిస్తుంది. అంటే రూ.30వేల బీమాకు ప్రభుత్వ రాయితీ రూ.1536 కాగా లబ్ధిదారుడి ప్రీమియం రూ.384. అదేవిధంగా రూ.15వేల బీమాకు ప్రభు త్వ రాయితీ రూ.768, లబ్ధిదారులు రూ.192 చెల్లించాలి. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న పాడిరైతులకు 50శాతం రాయితీ అందుతుంది.



గొర్రెలు, మేకలు, పందులకు..

6నెలలు ఆపైన వయసు కలిగిన గొర్రెలు, మేకలు, పంది లకు ఒకదానికి రూ.6వేలు బీమా వర్తిస్తుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీలకు 80 శాతం రాయితీ లభిస్తుంది. ప్రభుత్వ రాయితీ రూ.300, లబ్ధిదారుని ప్రీమియం రూ.75. దారిద్ర్యరేఖకు ఎగువ ఉన్నవారికి 50శాతం రాయితీ అందుతుంది.

మూడేళ్ల వరకు వర్తింపు

జిల్లాలో పశుబీమా నమోదు జరుగుతోంది. ఒకసారి బీమా చెల్లిస్తే మూడేళ్ల వరకు వర్తిస్తుంది. 80 శాతం రాయితీ పొందాలనుకునే లబ్ధిదారులు బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డులతో పాటు రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకుని రైతు సేవా కేంద్రా లను సంప్రదించాలి

- రమేష్‌నాయక్, పశుసంవర్ధక శాఖ జేడీ

టమో'రా'!



- గిట్టుబాటు లేక చెట్లకే వదిలేశారు!

కందుకూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : టమోటా సాగు చేపట్టిన అన్నదాత ఆర్థిక ఊబిలో కూరుకుపోతున్నాడు. కనీసం గిట్టుబాటు ధర కూడా దక్కకపోవడంతో కాయలన్నీ చెట్లకే వదిలేస్తున్నారు. మార్కెట్లో కిలో టమోటా రూ.15 నుంచి 16 వరకు పలుకుతోంది. సాగుదారుల వద్ద కిలో ఆరు రూపాయలకు కూడా కొనే పరిస్థితి లేదు. అయితే, పండించిన టమోటాలను కోసి మార్కెట్‌కు తరలించాలన్నా కిలోకు రూ.10వరకు వ్యయం అవుతుండటంతో కోత ఖర్చులు కూడా రావని వదిలేసుకుంటున్నారు. కందుకూరు ప్రాంతంలో ఓగూరు, బొంతవారిపాలెం తదితర ప్రాంతాలలో ఈ ఏడాది విస్తారంగా టమోటా సాగుచేశారు. డిసెంబరు, జనవరి మాసాలలో వేసిన టమోటా నాట్లు ప్రస్తుతం నిండుగా కాపు, పండిన కాయలతో దర్శనమిస్తున్నాయి. ఎకరానికి 30-40 వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన టమోటాలు కొనేనాథుడు లేక రైతులు దయనీయ స్థితిని ఎదుర్కొంటున్నారు. కూరగాయల సాగు లాభాలు పండిస్తాయని, టమోటా సాగుతో లక్షాధికారులు కావచ్చన్న ఆకాంక్షతో సాగుచేసిన రైతులు నేడు నష్టపోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌కు సన్నాహాలు

- నాలుగు విడతల్లో నిర్వహణ

నెల్లూరు (విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల హడావుడి పూర్తవుతున్న తరుణంలో స్పాట్ వాల్యుయేషన్ కూడా వేగవంతంగా పూర్తి చేయాలంటూ ఇంటర్‌బోర్డు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో నాలుగు విడతల్లో స్పాట్‌ను పూర్తి చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పాట్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి ఈ నెల 7వ తేదీన తొలుతగా సంస్కృతం మూల్యాం కనాన్ని ప్రారంభించారు. తాజాగా పరీక్షలన్నీ పూర్తవుతుండటంతో 17వ తేదీ నుంచి మొదటి స్పెల్‌లో ఇంగ్లీష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్, సివిక్స్ సబ్జెక్టులలో మూల్యాం కనం నిర్వహిస్తున్నారు. అలాగే 22 నుంచి రెండవ స్పెల్‌లో ఫిజిక్స్, ఎకనామిక్స్‌లలో, 24 నుంచి మూడో స్పెల్‌లో కెమిస్ట్రీ, హిస్టరీ సబ్జెక్టులు, 26 నుంచి నాలుగో స్పెల్‌లో బాటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్టులలో స్పాట్ వాల్యూయేషన్ ప్రారంభించనున్నారు. ఇంటర్‌బోర్డు మూల్యాంకనానికి నియమించిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులంతా సంబంధిత తేదీల్లో స్పాట్ సెంటర్‌లో తప్పనిసరిగా రిపోర్టు చేయాలని ఆర్ఐవో శ్రీనివాసులు పేర్కొన్నారు. హాజరుకాని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆత్మకూరు
ఉదయగిరి

ఉత్సాహంగా హోలీ సంబరాలు


ఉదయగిరిలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

ఉదయగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో హోలీ వేడుకలు శుక్రవారం ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నాపెద్దా తేడాలేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా గడిపారు. పట్టణంలోని పలు వీధుల్లో చిన్నారులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

●సంగం: హోలీ పండుగను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకొని సందడి చేశారు.

● సీతారామపురం : మండలంలో హోలీ సంబరాలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

జర్నలిస్టు వెంకటేశ్వర్లు మృతికి సంతాపం

ఉదయగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణం ఆవులవీధికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఆవుల వెంకటేశ్వర్లు కావలిలో శుక్రవారం ఆకస్మికంగా గుండెపోటుతో మృతిచెందడం పట్ల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తంచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


జాతీయ రహదారి మీదుగా మేత, నీరు ఉన్న ప్రాంతాలకు వెళుతున్న ఆవులు

మేత, నీటి కోసం మూగజీవాల వలస బాట

ఉదయగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేసవికి ముందే మూగజీవాలకు మేత, నీటి కష్టాలు మొదలయ్యాయి. అడవుల్లో పచ్చిక, నీటి జాడలు కనిపించకపోవడంతో ఆవుల మందలు కిలోమీటర్ల కొద్దీ వలస వెళుతున్నాయి. నెల్లూరు సమీపంలోని గొలగమూడికి చెందిన కొందరు పశు పోషకులు గత ఐదు నెలల క్రితం తమ ఆవుల మందను నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో వెలుగొండ, నల్లమల అడవులకు తీసుకొచ్చారు. అప్పట్లో మేత, నీరు పుష్కలంగా ఉండడంతో మూగజీవాలకు ఇబ్బందులు తలెత్త లేదు. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో అడవుల్లో పచ్చిక, నీటి జాడలు కనిపించడంలేదు. దీంతో చేసేదేమీలేక తమ ఆవులను స్వగ్రామానికి తోలుకెళ్లారు.

న్యూస్ బాక్స్

ఉపాధి పనులపై గ్రామసభ


గ్రామ సభలో మాట్లాడుతున్న డిఆర్‌పి

సీతారామపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బిట్-1 సచివాలయంలో 2023-2024 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల తనిఖీపై సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసిన పనుల్లో లోటుపాట్లను చదివి గ్రామ ప్రజలకు వినిపించారు. కూలీలు వాటిపై కొన్ని అభ్యంతరాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ టిఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బీద ఎన్నికపై హర్షం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీద రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పాములపల్లి సర్పంచు తెల్లగొర్ల సుశీల, టీడీపీ నాయకులు తెల్లగొర్ల వెంకటయ్యయాదవ్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే నెల్లూరు పార్లమెంట్ బీసీ సెల్ కార్యదర్శి అరవ రవీంద్రయాదవ్ సైతం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

అప్రకటిత విద్యుత్ కోతతో ప్రజల అవస్థలు

ఉదయగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత రెండు రోజులుగా అప్రకటిత విద్యుత్ కోత విధిస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గురు, శుక్రవారాల్లో సాయంత్రం 4.30 గంటల నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ కోత విధించారు. ఓవైపు మండుతున్న ఎండలు, మరోవైపు ముస్లింల రంజాన్ ఉపవాస దీక్షల సమయంలో ఇలా విద్యుత్ కోతలు విధించ డంపై పలువురు మండిపడుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ ఖుద్దూస్ బాషాను వివరణ కోరగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా కోత విధించామని ఇకపై ఉండవన్నారు.

నేడు కులవృత్తిదారుల సమావేశం

ఉదయగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం బీసీ కులాలకు చెందిన కులవృత్తిదారుల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అప్పాజీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదరణ-3 పథకం కింద అవసరమైన పనిముట్ల గురించి చర్చించి ప్రభుత్వానికి నివేదిక పంపడం జరుగుతుందన్నారు. కావున కులవృత్తిదారులు పాల్గొనాలని కోరారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

అనంతసాగరం మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి కూలీలకు రావల్సిన బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం పుల్లయ్య, మండల నాయకుడు అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం చిలకలమర్రి, మంగుపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకొని ఏపీవో దయాసాగర్‌కు వివరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉదయగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన పోతురాజు సమేత గంగమ్మతల్లి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ గణపతి పూజ, పుణ్యాహ వచనం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశ స్థాపన, అఖండ దీప ప్రతిష్ఠ, వాస్తు మండపారాధన, ఆదిత్యాది నవగ్రహ మండపారాధన, అంకురారోహణ, ప్రధాన దేవతా ఆవాహనము పంచగవ్యాది జలాధి, క్షీరాది వాసనములు తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఆదివారం జరిగే గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆలయ కమిటీ చైర్మన్ పాముల రమణయ్య కోరారు.

ప్రజాసమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం : సీపీఎం


పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

ఉదయగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ప్రజాచైతన్య యాత్రను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎన్నికల సమయంలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని హామీలు గుప్పించిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఉదయగిరి ప్రాంతంలో శాశ్వత కరవు నివారణకు వెలుగొండలో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సీతారాం సాగర్ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. రైతులు పండించిన పంట దిగుబడులను రైతుసేవా కేంద్రాల్లో మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదన్నారు. రహదారులను నిర్మించి ప్రజల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడె రమణయ్య, నాయబ్, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీల్లో నిజాలు నిగ్గు తేలేనా...

● వైసీపీ ప్రభుత్వంలో సిబ్బంది చేతివాటం
● తనిఖీ బృందాలకు అందని రికార్డులు


ఉపాధి పనులను పరిశీలిస్తున్న తనిఖీ బృంద సభ్యులు

ఉదయగిరి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వలసల నివారణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో దోచుకున్నోడికి దోచుకున్నంత అన్న చందంగా మారిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లా కేంద్రానికి శివారు ప్రాంతం కావడంతో ఉన్నతాధికారుల తనిఖీలు ఉండవనే ధీమాతో అధికారుల నుంచి గ్రామస్థాయిలోని క్షేత్రసహాయకుల వరకు ఇష్టానుసారంగా వ్యవహరించి నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆయా మండలాల్లో 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు జరిగిన కాలువలు, జగనన్న లేఅవుట్లు, ఇళ్ల నిర్మాణాలు, రహదారులు తదితర పనులను ఈనెల 6వ తేదీ నుంచి సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో పరిశీలన చేస్తున్నారు. అందులో భాగంగా ఉదయగిరిలోని 17 పంచాయతీల్లో ఉపాధి పథకం కింద రూ. 11 కోట్లు, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల పరిధిలో మరో రూ. 2.90 కోట్ల వ్యయంతో జరిగిన పనులను పరిశీలించంతో పాటు కూలీలను సమగ్రంగా విచారించాల్సి ఉంది. అలాగే సీతారామపురంలోని 14 పంచాయతీల్లోను రూ. 8,35,69,875 కోట్ల పనులను పరిశీలించడంలో బృంద సభ్యులు నిమగ్నమయ్యారు. పలు గ్రామాల్లో క్షేత్ర సహాయకులు తమకు అనుకూలమైన వారి పేర్లతో దోపిడీకి పాల్పడడంతో పాటు ఒకే వ్యక్తి పేరుతో రెండేసి జాబ్‌కార్డులు, స్థానికంగా నివాసాలు లేనివారి పేర్లతో బినామీ మస్టర్లు వేయడంలో చేతివాటం ప్రదర్శించి జేబులు నింపుకున్నట్లు తనిఖీల్లో వెల్లడవుతుండడం గమనార్హం. పనుల కొలతల్లోను భారీ వ్యత్యాసాలు ఉన్న ట్లు నిర్ధారణ అవుతుండడం చూస్తుంటే ప్రతి పంచా యతీలో లక్షల్లో అవినీతి చోటుచేసుకున్నట్లు బట్టబయ లయ్యే అవకాశాలున్నాయి. అప్పట్లో రాజకీయ ఒత్తిడికి తలొగ్గిన అధికారులు కూడా అందుకు వత్తాసు పలికి నట్లు తెలుస్తోంది.

రికార్డులు లేకుండా తనిఖీలెలా..

ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో మారిన రాజకీయ పరిణామాల దృష్ట్యా పలు పంచాయతీల్లో వైసీపీకి వీర విధేయులుగా ఉన్న క్షేత్ర సహాయకులను ఇటీవల విధుల నుంచి తప్పించడం జరిగింది. అదే సాకుగా చూపుతున్న కొంతమంది క్షేత్ర సహాయకులు తనిఖీ బృందాలకు పూర్తిస్థాయిలో రికార్డులు, మస్టర్ల జాబితాలను అప్పగించకుండా తప్పించుకొని తిరుగుతున్నారు. వాటి కోసం రోజుల తరబడి ఎదురుచూసిన కార్యాలయ అధికారులకు నిరాశే మిగిలింది. ఈనేపథ్యంలో గ్రామాల్లో జరిగిన పనులను చూపించి తనిఖీ బృందానికి సహకరించే నాథులు లేకుండా పోయారు. రికార్డులను అప్పగిస్తే గతంలో జరిగిన అవినీతి బయటపడుతుందనే భయంతో అప్పటి సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడడమే లేదు. దీంతో తనిఖీ బృందాలు సైతం చేసేదేమిలేక నామమాత్రంగా విచారణ చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. అధికశాతం పంచాయతీల్లో ఇలాంటి పరిస్థితులే దాపురించడంతో అవినీతి నిగ్గు తేలేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మారుమూల ప్రాంతాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఉపాధిలో అవినీతికి పాల్పడిన బాధ్యులపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తిలేఖ


ఉపాధ్యాయుడు అందజేసిన స్ఫూర్తిలేఖ చూపుతున్న విద్యార్థులు

అనంతసాగరం మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ఈనెల 17వ తేదీ నుంచి జరుగుతున్న సందర్భంగా మండలంలోని కామిరెడ్డిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులకు పంచ సూత్రలతో స్ఫూర్తిలేఖ రాసి శుక్రవారం అందజేశారు. ఇందులో స్వశక్తి, పునశ్చరణ, ఆరోగ్యంపై శ్రద్ధ, ఒత్తిడిని ఎలా జయించాలి తదితర అంశాలపై సూచనలు చేశారు. సూత్రాలను పాటించి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

సోమశిలలో 55.697 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి14 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి 55.697 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 600, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నిరుపయోగంగా చెత్త బుట్టలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పారిశుద్ధ్యం మెరుగుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం పుణ్యమాని అవి ఆచరణకు నోచుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లక్షలు వెచ్చించి గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించిన ప్రభుత్వం నివాసాలను నుంచి తడి, పొడి చెత్తను సేకరించేందుకు ప్లాస్టిక్ చెత్త బుట్టల పంపిణీకి శ్రీకారం చుట్టింది. అయితే అలాంటి బుట్టలు పంపిణీకి నోచుకోక సచివాలయాల్లో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. రామాపురం సచివాలయంలో నెలల తరబడి పంపిణీకి నోచుకోక నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బుట్టలను పంపిణీ చేసి ప్రజలు వినియోగించుకొనేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


నిరుపయోగంగా ఉన్న చెత్త బుట్టలు


బీసీ కాలనీలో కనీస వసతుల కరువు

● కాలనీ వాసుల అవస్థలు ● పట్టించుకోని అధికారులు


అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారి

సంగం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం బీసీ కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామానికి ఈశాన్యం వైపు బీసీ కాలనీ ఉంది. సుమారు 100 కుటుంబాలకు పైగా నివసిస్తున్నారు. ఈ కాలనీ అంతా పల్లంగా ఉండడంతో గ్రామంలో పడిన వర్షపు నీరంతా ఈ కాలనీ గుండా ఉత్తరం వైపు ప్రవహించి సదరన్‌చానల్‌లో కలుస్తాయి. వర్షాలు అధికంగా పడినప్పుడు పొలాల్లో నీరు వెళ్లక రెండు మూడు రోజులు కాలనీ చుట్టూ మోకాళ్ల లోతు నిలిచిపోతున్నాయి. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీటి వల్ల అంతర్గత రహదారులన్నీ అధ్వానంగా తయారయాయి. అయితే కాలనీలోని ప్రధాన రహదారికి గ్రావెల్‌తో లెవలింగ్ చేశారు. కానీ కాలనీ ఇళ్లన్నీ లోతట్టులో ఉండడంతో కొన్ని పూరిళ్లలోకి వర్షపునీరు చేరుతుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో పబ్లిక్ చేతి పంపులు లేవు. పంచాయతీ కుళాయి నీళ్లే దిక్కు. వాటర్ ట్యాంకు లేదు. కుళాయిలకు నేరుగా నీటిని విడుదల చేస్తున్నారు. కరెంటు లేకపోయినా, మోటారు మరమ్మతులకు గురైనా తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. కాలనీలో ఆర్థిక స్థోమతు ఉన్న కొందరు ఇళ్ల వద్ద మినీ చేతి పంపులు ఏర్పాటు చేసుకున్నారు. ఎండాకాలం వస్తే మినీ చేతిపంపుల్లో నీళ్లరావు. కేవలం పంచాయతీ కుళాయిలపై ఆధారపడాలి. అలాంటి సమయాల్లో మోటారు చెడిపోతే బిందె నీటి కోసం నడవాల్సిందేనని, అధికారులు స్పందించి బీసీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

ఆ రహదారిపై ప్రయాణం.. ప్రమాదకరం


ప్రమాదకరంగా మారిన కాంచెరువు - గువ్వాడి రహదారి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంచెరువు - గువ్వాడి గ్రామాల సమీపంలోని ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. అసలే సింగిల్ రోడ్డు, ఆపై రహదారికి ఇరువైపులా వ్యవసాయ పొలాల కంచెలు, కంపచెట్లు సైతం ఏపుగా పెరగడంతో రోడ్డు మార్జిన్లు కనిపించడం లేదు. దీంతో ఆయా గ్రామాల వద్ద బస్సులు, లారీలు, ట్రాక్టర్లు వంటి వాహనాలు ఎదురు పడితే మరో వాహనం తిరిగి కొంతదూరం వెనుకకు ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే అవకాశం లేకపోవడంతో ప్రమాదాలు సంభవించి వాహనదారులు మృత్యువాత పడడంతో పాటు గాయాలపాలైన సంఘ టనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా

● తప్పిన ప్రమాదం



కావలి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డులోని భా రత్ గ్యాస్ ఏజన్సీ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం కారు ఢీకొని బోల్తా పడింది. స్థానికుల, వాహనదారుల వివరాల మేరకు.. మద్యం మత్తులో ఉన్న వ్యక్తి కావలి నుంచి తుమ్మలపెంట వైపునకు వాహనాన్ని అతివేగంగా నడిపి ప్రమాదానికి కారణ మైనట్లు తెలిపారు. ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగిపోవటంతో పాటు 11కేవీ ఎల్‌టీ లైన్ వైర్లు తెగిపోయాయి. ఆ సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవటం, విద్యుత్ లైన్ల కింద ఎవరూ లేక పోవటంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని వ్యక్తి పరారయ్యాడు. ఈ ప్రమాదంతో విద్యుత్‌శాఖకు రూ.15వేల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ఈమేరకు 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

హైవేపై స్పిరిట్ ట్యాంకర్ లారీ బోల్తా

● ట్రాఫిక్‌కు అంతరాయం


బోల్తాపడిన స్పిరిట్ లారీ ట్యాంకర్‌ను పైకి లేపుతున్న క్రేన్లు

వెంకటాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం స్పిరిట్ ట్యాం కర్ లారీ బోల్తాపడింది. వివరాల మేరకు.. నెల్లూరు నుంచి గూడూరు వైపు స్పిరిట్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్ లారీ అదుపు తప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో లారీ వెనుకభాగంలో ఉన్న ట్యాంకర్‌లోని స్పిరిట్ అంతా రోడ్డుమీదకు చేరింది. పెనుప్రమాదం జరగకముందే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. బోల్తాపడిన లారీ ట్యాంకర్‌ను క్రేన్ల సాయంతో పైకి లేపారు. స్పిరిట్ లారీ బోల్తాపడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్‌కు రైల్వే సీఐ

నెల్లూరు(క్రైం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తోటి సిబ్బంది ఫిర్యాదులు, అవినీతి ఆరోపణల నేపథ్యంలో నెల్లూరు జీఆర్‌పీ సీఐ భుజంగరావును ఉన్నతాధికారులు వీఆర్‌కు బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. 2023 సెప్టెంబరులో నెల్లూరు రైల్వే సీఐగా భుజంగరావు బాధ్యతలు చేపట్టారు. కొంతకాలంగా ఆయనపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నేరుగా సీఎం, డిప్యూటీ సీఎం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో రైల్వే ఎస్పీ రాహుల్ మీనా నేరుగా రంగంలోకి దిగారు. నెల్లూరు జీఆర్పీ స్టేషన్‌కు చేరుకుని విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఈక్రమంలో సీఐ భుజంగరావును వీఆర్‌కు పిలుస్తూ ఉత్తర్వులు జారీచేశారు. శనివారం ఆయన రిలీవ్ కానున్నారు.

'వైసీపీ నేత దౌర్జన్యం చేస్తున్నారు'

నెల్లూరు(క్రైం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత మొయిళ్ల సురేష్‌రెడ్డి తమపై దౌర్జన్యం చేస్తున్నారని వాదనాల రాజేష్ అనే వ్యక్తి ఆరోపించారు. శుక్రవారం నెల్లూరులోని కల్యాణ్ నగర్‌లో గల తన స్థలం వద్ద రాజేష్ విలేకర్లతో మాట్లాడారు. జీవీఆర్ఆర్ కళాశాల వద్ద 2022లో స్థలం కొనుగోలు చేశానని, అయితే ఆ స్థలంలోకి వైసీపీ నేత మొయిళ్ల సురేష్‌రెడ్డి వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. 62 అంకణాల స్థలానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నాయని, అయినా సురేష్‌రెడ్డి బెదిరిస్తున్నారని ఆరోపించారు. తాము దళితులం కావడంతో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. సురేష్‌రెడ్డి మూలంగా తమ కుటుంబం ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసీపీ నేత ఆనం విజయకుమార్‌రెడ్డి ఈస్థలం వద్దకు వచ్చి అవాస్థవాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికా రులు, పాలకులు స్పందించి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా ఆస్థలానికి సంబంధించి ఇరువురిని పత్రాలు తీసుకురావాలని సూచించామని, ఆ పత్రాలను రెవెన్యూ శాఖకు పంపి రికార్డులు పరిశీలించమని కోరుతామని చెప్పారు.

రౌడీషీటర్ దారుణ హత్య

రక్తపు మడుగులో మృతదేహం

భయంతో పరుగులు తీసిన ప్రజలు


మృతుడు చింటూ (ఫైల్)

నెల్లూరు(క్రైం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర ప్రజలు మరో సారి ఉలిక్కిపడ్డారు. నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఉడ్‌హౌస్ సంఘంలో ఇటీవల జరిగిన దారుణ హత్యను ఇప్పుడిప్పుడే మరిచిపోతున్న నగరవాసులకు వేదాయపాళెం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన దారుణ హత్య భయభ్రాంతులకు గురిచేసింది. రౌడీషీటర్ చింటూ దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. పాత వేదాయపాళేనికి చెందిన ఏ సుజన్ కృష్ణ అలియాస్ చింటూ(24) పలు హత్య, హత్యాయత్నం కేసుల్లో నిందితుడు. అతనిపై వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. కొంతకాలంగా కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటున్న చింటూ శుక్రవారం రాత్రి పొదలకూరురోడ్డు జడ్పీ హైస్కూల్ సమీపంలోని ఇందిరాగాంధీ నగర్ రెండో వీధికి వచ్చాడు. ఈ క్రమంలోనే గుర్తుతెలియని కొందరు యువకులు కత్తులతో దారుణంగా నరికి హత్య చేసి పరారయ్యారు. విచక్షణా రహితంగా తల నుంచి కింద వరకు నరకడంతో చింటూ అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య జరిగిన ప్రాంతం రక్తపు మడుగయ్యింది. సమాచారం అందుకున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఫోన్‌చేసి పిలిపించి చింటూను దారుణంగా హత్య చేశారని ప్రాథమిక సమాచారం. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

రాళ్లపాడుకు రెగ్యులర్ ఈఈని నియమించండి

లింగసముద్రం, మార్చి 14 (ఆంధ్ర జ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టునకు రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరును నియమించాలని ప్రాజెక్టు ఆయకట్టు రైతులు కోరుతున్నారు. గతేడాది డిసెంబరు 31న అప్పటి ఈఈ సుగుణాపాల్ పదవీ విరమణ పొందారు. ఇరిగేషన్ ఉన్నతాధికారులు మార్కాపురం ఈఈ పురార్థనరెడ్డిని ఇన్‌చార్జి ఈఈగా నియమించారు. అయితే ప్రస్తుతం ప్రాజెక్టులో ఏఈలు, లస్కర్లు, ఎలక్ట్రీషియన్లు, అటెండర్లు, వాచ్‌మెన్‌ల కొరత వేధిస్తోంది. ఇరిగేషన్ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తిరుణాళ్ల

కావలి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని వైకుంఠపురం పెంకుల ఫ్యాక్టరీ రోడ్డులో వెలసిన పోలేరమ్మ తిరునాళ సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 3రోజుల పాటు నిర్వహించనున్న తిరుణాళలో ఉదయం అభిషేకాల అనంతరం రాత్రి 7గంటలకు పల్లకీసేవ, గుడి ఉత్సవం నిర్వహిసారు. శనివారం ఉదయం దుర్గహోమం, రాత్రి 8గంటలకు తిరుపతమ్మ బుర్ర కథ, ఆదివారం అమ్మవారికి ఉదయం పొంగళ్లు, మొక్కుబడులు, మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న సంతర్పణ, రాత్రి 8 గంటలకు మృగరాజు వాహనంపై అమ్మవారి గ్రామోత్సవం చేపడతారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ఉలవపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహిళల స్వయం సంవృద్ధిలో భాగంగా టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.విజయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రీయ, బ్రాహ్మణ మహిళలు స్థానిక సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సంప్రదించి దరఖాస్తు అందజేయాలన్నారు. రోజుకి 8గంటల శిక్షణ కాలానికి 45రోజులు, 6గంటల కాలానికి 60 రోజులు, 4గంటల శిక్షణకు 90 రోజులుగా ఎంపిక చేసుకొని శిక్షణ పొందవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉలవపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చాకిచర్ల, అలగాయపాలెం, కరేడు గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖ సిబ్బందితో సహకరించగలరని కోరారు.

16 నుంచి 23 వరకు అమ్మవార్లకు పొంగళ్లు

కందుకూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రామదేవతలకు ఈనెల 16 నుంచి 23వరకు సద్దులు, పొంగళ్ల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామదేవతల వారసత్వ ధర్మకర్త దివి లింగయ్యనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ వరకు పోలేరమ్మతల్లికి సద్దులు, మహాలక్ష్మి అమ్మవారికి వడపప్పును భక్తులు సమర్పించాలని 23న అంకమ్మ అమ్మవారికి పాలపొంగళ్లు పెట్టుకోవాలని కోరారు.

గ్రేడింగ్‌తోనే మద్దతు ధర



వెలగపాడు కొత్తూరు వద్ద గ్రేడింగ్‌ను పరిశీలిస్తున్న టీమ్ సభ్యులు

కలిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పొగాకునకు మద్దతు ధర అందాలంటే గ్రేడింగ్ విధానంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పొగాకుబోర్డు ఫీల్డ్ ఫ్రెండ్స్ టీమ్-6 సభ్యులు ఐటీసీ సైంటిస్టు వెంకటేశ్వరరావు, శివారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ మరియు క్షేత్ర సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం వేలం కేంద్రం పరిధిలోని కొత్తూరు, వెలగపాడు, పెద్దపాడు, కమ్మవారిపాలెం, కావలియడవల్లి గ్రామాలను సందర్శించారు. గ్రేడింగ్ విధానాన్ని పరిశీలించి పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలను తెలిపారు. గ్రేడింగ్‌ను బట్టి ధరల్లో వ్యత్యాసం ఉంటుందని, బోర్డు అధికారులు తెలియజేసే సూచనలు పాటించి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ మాల్యాద్రి పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో చూసే సెన్సార్ ఏర్పాటు

లింగసముద్రం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):రాళ్లపాడు ప్రాజెక్టు నీటి వనరులను వెబ్‌సైట్‌లో చూసేందుకు గేజింగ్ డివిజన్ అధికారులు ప్రాజెక్టు వద్ద సెన్సార్‌ను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో నీటి నిల్వ, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో, నీటిలోతు ఎంత ఉంది.. ఇతర వివరాల కోసం దీన్ని ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. నీటి వనరులను ఈ వెబ్‌సైట్‌లో ఒంగోలు, గుంటూరు, విజయవాడ ఇరిగేషన్ ఉన్నతాధికారులు చూసి ప్రభుత్వానికి తెలియజేస్తుంటారని చెప్పారు.

కొలిక్కిరాని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ

- నాలుగు బ్యాంకుల పరిధిలో 44 యూనిట్ల మంజూరు
- 216 మంది దరఖాస్తుదారులు
- పూర్తయిన ఇంటర్వ్యూలు

కొండాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పలు సామాజిక కార్పొరేషన్లతో రాయితీ రుణాలు అందజేసేందుకు ప్రభుత్వం గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి సంబంధించిన అన్నిర కాల ధ్రువీకరణ పత్రాలతో మండలపరిధిలోని అన్ని సామాజికవర్గాలకు చెందిన లబ్ధిదారులు 216మంది ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటర్వ్యూలను గతనెలలో అధికారులు, సంబంధిత బ్యాంకర్లు పూర్తి చేశారు. ఎవ్వరిని ఎంపిక చేస్తారో అని అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఇదీ మండలంలో రాయితీ రుణాలకు నమోదు చేసుకున్న దరఖాస్తుదారుల పరిస్థితి.

● మంజూరైన యూనిట్లు 44

మండలంలో కొమ్మి, కొండాపురం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులు, సాయి పేట, తూర్పు ఎర్రబల్లిలో యూనియన్ బ్యాంకులున్నాయి.

● కొమ్మి బ్యాంకు పరిధిలో బీసీ-7, కాపు-1, రెడ్డి-1, కమ్మ-1 మొత్తం 10 లోన్లు, కొండాపురం బ్యాంకు పరిధిలో బీసీ-8, కాపు-1, ఈబీసీ-1, రెడ్డి-1, బ్రాహ్మణ-1, జనరిక్ ఈబీసీ-1 మొత్తం 13, సాయిపేట బ్యాంకు పరిధిలో బీసీ-8, కాపు-1, రెడ్డి-1, కమ్మ-1 మొత్తం 11లోన్లు, తూర్పుఎర్రబల్లి బ్యాంకు పరిధిలో బీసీ-7, కాపు-1, రెడ్డి-1, ఆర్యవైశ్య-1 మొత్తం 10లోన్లు మంజూ రయ్యాయి. మొత్తంగా బీసీ-30, కాపు-4, ఈబీసీ-2, రెడ్డి-3, కమ్మ-2, ఆర్యవైశ్య-1, బ్రాహ్మణ-1, జనరిక్ ఈబీసీ- 1 కలిపి 44 లోన్లు మంజూరయ్యాయి. ఈ లోన్ల కోసం 221 మంది ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోగా లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంట ర్వ్యూలు నిర్వహించిన అధికారులు తుది జాబితాను విడుదల చేయలేదు.



లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు (ఫైల్)

● లబ్ధిదారుల ఎంపికలో నాయకుల సతమతం

తక్కువగా లోన్లు మంజూరవ్వడం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోవడంతో ఎవరిని ఎంపికచేయాలో అర్థకంకాక అధికార పార్టీ నాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. దీనికితోడు టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు అధికారికంగా కూటమికావడంతో ఎవరికి వారు మేమే అని చెప్పుకుంటున్నారు. సమన్వయం చేసేందుకు మండలంలో నాయకులు అంతగా చొరవ తీసుకోవడం లేదు. ప్రతియూనిట్‌కు 50 శాతం రాయితీపోగా మిగిలిన నగదు బ్యాం కులు లోనుగా ఇచ్చి అభ్యర్థులు ఎంచుకొన్న రంగంలో పెట్టుబడి పెట్టి వాయిదాలవారీగా బ్యాంకులకు సకాలంలో చెల్లించాల్సి ఉంటుంది. 50శాతం రాయితీ వస్తుండటంతో ఎక్కువ మంది లోను తమకే కావాలని కోరుకుంటున్నారు. మార్చి నెలాఖరులోగా ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో ఈలోగా ఎవరిని ఎంపిక చేస్తారో అని దరఖాస్తుదారులు ఎదురు చూస్తున్నారు.

ప్రక్రియను సకాలంలో పూర్తిచేస్తాం



రాయితీ రుణాలకు అభ్యర్థుల ఎంపిక పక్రియ సకాలంలో పూర్తిచేస్తాం. ప్రతి యూనిట్‌కు ఇద్దరి ని ఎంపిక చేసి సంబంధిత బ్యాంకులకు జాబి తాను అందజేస్తాం.

- ఆదినారాయణరావు, ఎంపీడీవో, కొండాపురం

భూ వివాదంపై విచారణ

కలిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పెదకొండూరులోని కాలనీవాసులు, పట్టాదారులకు జరిగిన భూ వివాదంపై శుక్రవారం తహసీల్దారు రవీంద్రబాబు తన కార్యాలయంలో రెవెన్యూ కోర్టు నిర్వహించారు. ఇరువర్గాలను పిలిపించి వారి వద్దనున్న పత్రాలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దారు కార్యాలయం నుంచి వెలుపలికి వచ్చే సమయంలో ఇరువర్గాలవారి మధ్య వాగ్వాదాలు పెరిగి దాడి చేసుకునే పరిస్థితి ఏర్పడింది. స్థానికుల సర్దుబాటు అనంతరం ఇరువర్గాలు పోలీసుస్టేషనుకు వెళ్లారు. రెవెన్యూ అధికారుల నుంచి సదరు స్థలానికి హక్కుదారులు ఎవరూ అని తేలేవరకు స్థలంలోకి ఎవరూ వెళ్లకూడదని ఎస్ఐ ఉమా శంకర్ హెచ్చరించారు.



పత్రాలు పరిశీలిస్తున్న తహసీల్దారు

ఉల్లాసంగా హోలీ సంబరాలు

కలిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు శుక్రవారం హోళి సంబరాలు జరుపు కున్నారు. చిన్నారులు, యువకులు మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా పండుగ వేడుకలు చేసుకున్నారు. పట్టణంలోని బీవీఆర్ అపార్ట్‌మెంట్ వద్ద పెద్దల సమక్షంలో చిన్నారులు వాటర్‌గన్‌లో రంగులు నింపుకొని ఒకరిపై ఒకరు చల్లుకున్నారు.



సంబరాల్లో పాల్గొన్న కుటుంబసభ్యులు

● కావలి టౌన్ (ఆంధ్రజ్యోతి): హోళీ పండుగ పర్వదినంను పురస్కరించుకుని పట్టణ ప్రజలు హోళి సంబరాలు నిర్వహించారు. మొదట ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయా కూడళ్లలో నివాసం ఉన్న పిల్లలు పెద్దలు కలిసి రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. ముసునూరు రాఘవేంద్ర కాలనీలోని ఓ నివాసంలో ఇతర ప్రాంతాల్లో నివసించే వారు సైతం కావలికి చేరుకుని కుటుంబసభ్యులంతా రంగులు చల్లి మిఠాయిలు పంచిపెట్టి పండుగ శుభాకాంక్షలు తెలుపు కున్నారు.

● కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలల్లో శుక్రవారం హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ పండుగలో చిన్నారులు, పెద్దలు రంగులు చల్లుకుంటూ సరదగా, ఆనందంగా వేడుకలు నిర్వహించుకున్నారు. వైకుంఠపురంలో చిన్నారులు వాటర్ గన్‌లల్లో రంగునీళ్ల కలుపుకుని, డబ్బాలతో రంగునీళ్ల పోసుకున్నారు.



రంగులు చల్లుకుంటున్న పిల్లలు

మామిడి పంట సాగు పరిశీలన

- నూజివీడు ఉద్యాన శాస్త్రవేత్త కనన మహాలక్ష్మి

ఉలవపాడు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.రాజుపాలెం పరిసర ప్రాంతంలో సాగుబడిలో ఉన్న మామిడి తోటలను శుక్రవారం నూజివీడు ఉద్యానవన పరిశోధనా కేంద్రం సీనియర్ సైంటిస్టు కనక మహాలక్ష్మి పరిశీలించారు. నల్లతామర, తేనెమంజు పురుగు ఉద్రుతంగా ఉన్నట్లు గమనించారు. నివారణ చర్యలలకు బప్రోఫిజెన్, ఎసిటేట్ కెమికల్స్ 1.5 గ్రాములు వంతున లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అదేవిధంగా పసు పు, బులుగు జిగురు అట్టలు వాడాలని అవి అందుబాటులో లేకుంటే కాటన్ చీరలు జిగు రువంటి పదార్థాల్లో ముంచి చెట్ల మధ్య కట్టాలని రైతు లకు సూచించారు. ఆంత్రక్నోస్ పక్షి తె గులు కూడా అధికంగా ఉన్నట్లు గుర్తించి ని వారణకు సాఫ్ మందును పిచికారీ చేయాలన్నారు. పూత, పిందె రాలకుండా ఉండాలంటే ఒన్‌టైం నీటి తడులు సమక్రమంగా చెట్లకు పెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి బీ.జ్యోతి పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న నూజివీడు ఉద్యాన సైంటిస్ట్ కనక మహాలక్ష్మి

ఉపాధి కూలీలకు వసతులు లేనట్టేనా!?

వలేటివారిపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం వచ్చిందంటే ఉపాధి పనులు చేసేందుకు కూలీలు నానా అవస్థలు ఎదుర్కొంటారు. అందువల్ల ఈ నాలుగు నెలల్లో (మార్చి, ఏప్రిల్, మే, జూన్) ఉపాధి కూలీలకు పనుల పరిమాణాన్ని తగ్గించి సాధారణంగా వేతనం చెల్లించేవారు. అయితే ఈసారి కూలీలకు వేసవిభృతిపై కేంద్రప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ ఆదేశాలు జారీ కాలేదు. కూలీలకు చెల్లించే రోజువారీ వేతనం రూ.300లకు పెంచడంతో వేసవిభృతి అందుల్లోనే ఉంటుందని చెబుతున్నారు.

● మండలంలో ఇదీ పరిస్థితి..

21 గ్రామ పంచాయతీల్లో 10,683 జాబ్‌కార్డులున్నాయి. అందులో 17,775 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం 3వేలకు పైగానే కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. వేసవిలో ప్రభుత్వాలు మార్చి నెలలో 25శాతం, ఏప్రిల్‌లో 30శాతం, మే నెలలో 30శాతం, జూన్‌లో 20 శాతం వరకూ పనులు పరిమాణం తగ్గించి నూరుశాతం పనికి వేతనం అందించేవారు. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో కూలీలకు మంచినీటి సౌకర్యం పని ప్రదేశాల్లో టెంట్‌లు ఏర్పాటు, మెడికల్ కిట్లు ఓ ఆర్ఎస్ ప్యాకెట్లు అందించే వారు. అయితే ప్రస్తుతం పని ప్రదేశాలలో అలాంటి సౌకర్యాలు ఏమి లేవు. దీంతో కూలీలు వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెరుగుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని కూలీలకు వసతులు ఏ ర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు.



అయ్యవారిపల్లెలో మండుటెండలో పనులు చేస్తున్న కూలీలు

ఆస్తి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

- పన్నులు బకాయిలు చెల్లించకపోతే దుకాణాలు సీజ్ చేస్తాం
- మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘంలో ఆస్తిప న్నుల వసూళ్లకు మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కు మార్, రెవెన్యూ అధికారి ఫణికుమార్‌లు తమ సిబ్బందితో శుక్రవారం అధిక మొత్తంలో పన్నులు కట్టాల్సిన యజమానుల వద్దకు వెళ్లి ఒత్తిడి తెచ్చారు. నూరుశాతం ఆస్తి పన్నులు వసూళ్ల చేయాలని మున్సిపల్ ఉన్నతాధికారులు కమిషనర్లపై ఒత్తిడి తేవడంతో కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావ ణ్‌కుమార్, సచివాలయాల వారీగా టీమ్‌లు ఏర్పాటు చేసి వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇలా చేస్తున్నా ఆశించిన లక్ష్యాలు నెరవేరటం లేదు.



ఇంటి యజమానితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్, ఆర్వో తదితరులు

● రావాల్సిన బకాయిలు రూ.3కోట్లు

కావలి పురపాలక సంఘంలో ప్రభుత్వ ఆస్తులు మినహాయిస్తే ప్రయివేట్ ఆస్తుల పన్నుల డిమాండ్ రూ.10కోట్లు ఉంది. ఇప్పటివరకు రూ.7కోట్లు వసూలు అయ్యింది. మిగిలిన రూ.3 కోట్లు వసూలును కేవలం 15రోజులు మాత్రం వసూలు చేయాల్సి ఉంది. దీంతో నేరుగా ఆయనే రంగంలోకి దిగి తమ సిబ్బందితో ఆస్తిపన్నుల వసూళ్ల కోసం బకాయిదారుల ఇంటింటికి తిరుగుతున్నారు.

● కావలి రైల్వే రోడ్డులో మున్సిపల్ అధికారులు, ఇంటి యజమానురాలి మధ్య ఆసక్తికర సంభాషణలు చోటు చేసుకున్నాయి

మున్సిపల్ కమిషనర్: ఇంటి పన్ను బకాయి ఉంది. చెల్లించకపోతే మీ దుకాణాలు సీజ్ చేయాల్సి వస్తోంది.

ఇంటి యజమానురాలు: ఇంటి పన్నులు మీ ఇష్టప్రకారం పెంచుకుంటూ పోతే ఎలా కట్టాలి సార్. గతేడాది కన్నా రెట్టింపు పన్నులు పెంచారు. మౌలిక వసతులు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి.

కమిషనర్: ప్రభుత్వ ఆస్తుల ప్రకారం పన్నులు పెంచాం.

ఇంటి యజమానురాలు: మీరైతే మీ ఇష్ట ప్రకారం పన్నులు పెంచారు. మాకైతే మూడేళ్లుగా ఇంటి అద్దెలు పెరగటం లేదు. పన్నులు ఎక్కడ నుంచి తెచ్చికట్టాలి.

కమిషనర్: ఆస్తుల విలువలు పెరిగాయి కదా.

ఇంటి యజమానురాలు : ఆస్తుల విలువలు పెరిగితే ప్రయోజనం ఏమిటి. అసలు ఇళ్లను అద్దెకు తీసుకునే వారు కూడా లేరు. మా పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలి.

కమిషనర్: మీరు పన్నులు చెల్లించకపోతే మీ దుకాణం సీజ్ చేయక తప్పదని తమ సిబ్బందితో షట్టర్ వేయమని చెప్పటంతో ఆమె మెత్తబడింది. చివరకు ఇంటికి వెళ్లి కొంత పన్ను చెల్లించటంతో అధికారులు వెనుదిరిగారు. పన్నుల కోసం ఒత్తిడి తెస్తూ ఇళ్ల యజమానుల నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నారు.

గురుడుడిపై శ్రీవారి వైభోగం



కావలి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కచ్చేరిమిట్టలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఆల య కమిటీ అధ్యక్షులు అన్నవరం సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రధా న అర్చకులు బుర్రా శే షాచార్యులు అర్చక బృందం ఉత్సవ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉద యం హోమం, స్నపన ప్రత్యేక పూజలు, హోమం పూజల అనం తరం మోహిని ఉత్సవం కనులపండువగా సాగిం ది. గరుడ సేవలకు ఉభయదా తలుగా తిరివీధి బ్రహ్మయ్య దంపతులు తిరివీధి ప్రసాద్ దంపతులు వ్యవహరిం చారు. రాత్రి హోమం పూజల అనంతరం శ్రీవారు గురుడ వాహ నంపై విహరిస్తూ భక్తులకు ద ర్శన మిచ్చారు. కార్యక్రమంలో అ న్నవరం హనుమకుమార్, నరహరి హరిబాబు కమిటీ సభ్యులు భక్తజనం పాల్గొన్నారు.

చిన్నరైతుకు.. పెద్ద సాయం

- నూరుశాతం రాయితీతో సూక్ష్మ సేద్య పరికరాలు
- రానున్న ఖరీఫ్ నుంచి అమలు చేయనున్న ప్రభుత్వం

కలిగిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సన్న, చిన్నకారు రైతులతో పాటు ఎస్సీ, ఎస్టీ రైతులకు పంటల సాగులో సూక్ష్మ సేద్యం పరికరాలు (డ్రిప్)ను రానున్న ఖరీఫ్ పంటకాలం నుంచి ప్రభుత్వం నూరుశాతం ఉచితంగా అందించేందుకు కార్యచరణ రూపొందించింది. ఉద్యాన పంటల సాగులో బిందు, తుంపర సేద్యం అమలును ప్రోత్సహించడంతో పాటు సాగునీటి వృథాను అరికట్టేందుకు ఈ పథకం ఉపయోగపడనుంది.

● కేంద్రం 33శాతం.. రాష్ట్రం 67శాతం నిధులు మంజూరు

రాష్ట్రీయ కృషి వికాస యోజనలో భాగంగా రైతులకు ఇచ్చే ఉచిత పరికరాలకు అయ్యే ఖర్చులో కేంద్రం 33శాతం నిధులు అందిస్తే, రాష్ట్ర ప్రభుత్వం 67శాతం నిధులను భరిస్తుంది. ఈ విధానంలో లబ్ధిదారుడి పొలంలో ఖచ్చితంగా బోరు సౌకర్యం కలిగి ఉండాలి. బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తయిన తరువాత రైతుకు ఉన్న భూమిని బట్టి మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ నుండి డ్రిప్, స్ప్రింకర్ల పరికరాలు అందిస్తారు.

● 5ఎకరాలలోపు సాగుభూమి ఉన్న ఒక్కో రైతుకు సూక్ష్మ సేద్య పరికరాలకు గరిష్టంగా రూ2.18లక్షల వరకు, 5నుండి 10 ఎకరాల లోపు ఉన్న రైతులకు 50నుంచి 70 శాతం వరకు రాయితీపై గరిష్టంగా రూ.3.10లక్షల విలువైన పరికరాలు, 10నుంచి 12.5 ఎకరాల వరకు రైతులకు 50శాతం రాయితీపై గరిష్టంగా రూ.4లక్షల వరకు పరికరాలను అందిస్తారు.

● గత వైసీపీ ప్రభుత్వం సూక్ష్మసేద్యంపై శీతకన్ను ప్రదర్శించడంతో ఈ పథకం పూర్తిగా కుంటుపడింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత రూపొందించిన నూతన మార్గదర్శకాలు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమలులోకి రానున్నాయి. వచ్చే ఖరీఫ్‌కు అర్హులైన రైతులు తమ భూమి వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలియజేస్తున్నారు.

అధ్వానంగా దత్తాత్రేయ స్వామి ఆలయ రోడ్డు

లింగసముద్రం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మొగిలిచెర్ల సమీపంలోని దత్తాత్రేయస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్నది. మొగిలిచెర్ల నుంచి 3కిలోమీటర్ల దూరం ఉన్న ఆలయం రోడ్డు నాలుగు ఫర్లాంగుల దూరం వరకు మట్టి రోడ్డు ఉంది. మిగిలిన రోడ్డు తారు రోడ్డు. మట్టి రోడ్డుపై పలుచోట్ల గుంతలు ఏర్పడి రోడ్డు మార్జిన్లు ఇరువైపులా ఆక్రమణలకు గురవడంతో రోడ్డు కుదించుకొని పోయింది. వానాకాలంలో ఈ మట్టి రోడ్డు కాస్తా బురదమయంగా మారి వాహనాలు రాకపోకలకు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటారు. ప్రతి శనివారం భక్తులు ఈ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. అంతేగాక మాలకొండ ఆలయానికి వచ్చే భక్తులు కూడా ఈ ఆలయానికి వచ్చి దైవ దర్శనం చేసుకొంటారు. రెండు రోజుల పాటు ఈ రోడ్డుపై వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది.

గ్రామాల్లో బెల్టు తీసేదెవరు!?

- మండలంలో 3 మద్యం దుకాణాలు.. 150 బెల్టు షాపులు
- నియంత్రణకు అధికారుల మీనమేషాలు
- మామూళ్ల మత్తులో యంత్రాంగం

వలేటివారిపాలెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహించినా, ఎవరైనా ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదు. బెల్టు షాపులు వ్యవహారంలో కలుగజేసుకుంటే బెల్టు తీస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి పదే పదే చెబుతున్నా ఆయన మాటలు స్థానిక ఎక్సైజ్ అధికారులకు చెవి కెక్కడం లేదు. మండలంలో 3 దుకాణాలుంటే 150కి పైగానే బెల్టు షాపులు వెలిశాయి. బెల్టుషాపులను అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు మీమేషాలు లెక్కిస్తున్నారన్నది స్పష్ట అవుతోంది.

● అధికార పార్టీ నేతల కనుసన్నలోనే..

బెల్టు షాపులు అధికార పార్టీ నేతల కను సన్నలోనే నడుస్తున్నాయి. బెల్టుషాపు నిర్వాహకులకు మద్యం దుకాణాల యజమానులు మద్యం బాటిల్‌పై ఉన్న ఎంఆర్‌పీ రేటు కంటే అదనంగా రూ.10తీసుకుంటున్నారు. వీరు మద్యం దుకాణాల వద్దకు రాలేని వారికి బెల్టుషాపుల నిర్వాహకులు ఎంఆర్‌పీ కంటే అదనంగా రూ.50లకు మందుబాబులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ నేతల ప్రోత్సాహంతోనే బెల్టు షాపుల నిర్వాహణ కొనసాగుతుందని విమర్శలు లేకపోలేదు.

● అనధికారిక సిట్టింగ్‌లు

మద్యం దుకాణం పక్కనే అనధికారిక సిట్టింగ్‌లు ఏర్పాటు చేసుకొని అక్కడే మద్యం తాగేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సిట్టింగ్‌లకు అనుమతులు లేకపోయినా అనధికారికంగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మనల్ని ఎవరూ అడ్డుకుంటారనే ధీమా దుకాణుదారుల్లో ఉం డడంతోనే నిర్వహిస్తున్నారనే విమర్శలు లేక పోలేదు. వలేటివారిపాలెంలోని మద్యం దుకాణం పక్కనే సిట్టింగ్ వేసి మద్యం తాగేస్తున్నారు.

● మామూళ్ల మత్తులో అధికారులు

మద్యం దుకాణం పక్కనే సిటింగ్ ఏర్పాటు చేసుకొని మద్యం తాగుతున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు చూసి కూడా మిన్నకుండిపోవడంతో విమర్శలు వ్యక్త మవుతున్నాయి. బెల్టుషాపులను నివారించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. అంతేగాకుండా బెల్టుషాపులను ఎక్సైజ్ అధికారులే ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు లేక పోలేదు.

ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్య..



లింగసముద్రం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. ఈ సమస్యతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 7గంటల వరకు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా లింగసముద్రం డా.కృష్ణమోహన్ ప్రజా వైద్యశాల నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా మీ సేవా కేంద్రం వరకు ఈ ట్రాఫిక్ సమస్య ఉంటోంది. ఈ ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న రోడ్డు మార్జిన్లను పలువురు ఆక్రమించి, మార్జిన్లపై ఎత్తుగా మట్టి వేయడంతో రోడ్డు కుదించుకొని పోయింది. ఎదురెదురుగా వచ్చే బస్సులు, లారీలు ఇతర వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకొని పోతున్నాయి. ఇటీవల కాలంలో పరిమితికి మించి అధిక లోడుతో చిల్లకర్ర, జామాయిల్ కర్రతో వెలుతున్న లారీలు, ట్రాక్టర్లతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోంది. దీనికితోడు ద్విచక్ర వాహనాలు కూడా రోడ్డుకు ఇరువైపులా నిలిపివేస్తున్నారు. అధికారులు స్పందించి చర్య తీసుకోవాలని కోరుతున్నారు.



పసుపు, కుంకుమ పుచ్చకాయలు

పుచ్చకాయలు... వేసవి కాలం వచ్చిందంటే చాలు వీటికున్న ఆదరణ అంతా ఇంతా కాదు. నీటిశాతం ఎక్కువగా ఉన్న ఈ కాయలను తింటే శారీరానికి చలువ చేయడంతోపాటు ఆరోగ్యానికీ ఎంతో మంచిదని నిపుణులు చెబుతున్నారు. అందుకేనేమో చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా ఆరగిస్తారు. అయితే, ఇప్పటివరకు మనం పచ్చని చారలు, నల్లగా ఉండే పుచ్చకాయలనే చూశాము. అయితే మార్కెట్‌లో పసుపు రంగులో ఉన్న పుచ్చకాయలూ దర్శనమిస్తున్నాయి. అలాగే నల్లగా ఉన్న పుచ్చకాయ లోపల ఎరుపు రంగులో కాకుండా పసుపు రంగులో గుజ్జు ఉన్న కాయలూ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. బెంగళూరు, చెన్నై ప్రాంతాల నుంచి కొంతమంది వ్యాపారులు నగరానికి దిగుమతి చేసుకుంటున్నారు. సాధారణ కాయలు కిలో రూ.20 నుంచి 25 వరకు విక్రయిస్తుండగా వీటి ధర మరో రూ.5 అధికంగా ఉంటోంది. అయితనేం... నగర వాసులు మాత్రం వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. నగరంలోని మినీబైపాస్, మద్రాసు బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతం, పొదలకూరు రోడ్డు ఇలా అన్ని ప్రధాన కూడళ్లలో రంగురంగుల పుచ్చకాయలు విక్రయిస్తున్నారు. ఇంకేందుకు ఆలస్యం మీరు కూడా ఆ రంగుల పుచ్చకాయల రుచి ఏమిటో ఓసారి చూసేయండి..

- నెల్లూరు

(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

చంద్రమౌళికి పున్నమి పూజ

పున్నమి వేళ నిండు జాబిలి, పండు వెన్నెల ఎవరికైనా ఆహ్లాదాన్నిస్తుంది. నెల్లూరు నగరం కూరగాయల మార్కెట్ ముందున్న సాయి బాబా మందిరంపైన దర్శనమిచ్చే పరమేశ్వరుడికి పౌర్ణమి చంద్రుడు పూజ చేస్తున్న ట్లున్న ఈ దృశ్యం శుక్రవారం ఆంధ్రజ్యోతి కెమెరా కంట పడింది.

- ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్





సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్



మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవన్ అభిమానం



పవనుడు అందరివాడు..

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.



జనసైనికా.. కూల్..కూల్..

పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.


పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.



చిత్రాడదారులన్నీ జనపవనమై..



వీఆర్సీ మైదానంలో రంగులకు చల్లుకుంటున్న యువత



సంబరంగా హోలీ!

పాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా శుక్రవారం హోలీ సంబరం అంబరాన్ని తాకింది. పిల్లలు, యువత ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. నగరంలోని వీఆర్సీ మైదానం, మండపాల వీధి తదితర ప్రాంతాల్లో యువతీ యువకులు రంగులు చల్లుకున్నారు. అలాగే వైష్ణవ ఆలయాల్లో లక్ష్మీదేవికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం కనుల పండువగా పల్లకీ సేవలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా చండీ హోమాలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

గవర్నర్‌ను కలిసిన వీఎస్‌యూ వీసీ

- వర్సిటీ అభివృద్ధిపై ఉన్నత విద్య మండలి చైర్మన్‌తో చర్చ

వెంకటాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను గురువారం సాయంత్రం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌చాన్సరల్ (వీసీ) ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్ప గుచ్ఛాన్ని అందజేసి, సత్కరించారు. అనంతరం ఏపీ ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ కే మధుమూర్తిని కూడా మర్యాద పూర్వకంగా సత్కరించారు. ఈ సందర్భంగా వీఎస్‌యూ అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధనలకు ప్రోత్సాహం, విద్యార్థుల సౌకర్యాల అభివృద్ధి, వర్సిటీ పరిపాలనలో పారదర్శకత, విద్యార్థులకు మెరుగైన అవకాశాలను అందించేందుకు చేపట్టాల్సిన అంశాలతో పాటు ఇతర ముఖ్యాంశాలపై చర్చించారు. వీఎస్‌యూ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇస్తూ, నూతన విద్యా విధానాల అమలు, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలు, పరిశోధన వ్యాప్తికి అవసరమైన చర్యలపై సూచనలు అందజేశారు. వీసీ వెంట వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత కూడా ఉన్నారు.



గవర్నర్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

ప్రసన్నుడి ఆలయ అభివృద్ధికి సహకారం: మంత్రి ఆనం

బిట్రగుంట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ రూ.12.50 కోట్లతో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని వాటికి టెండర్లు పూర్తయి పనులు మొదలవుతున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణమండపం, ఈవో కార్యాలయం, విశ్రాంతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ 2028 నాటికి ఆలయంలో శాశ్వతంగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ రూ.1.85 కోట్లతో ఆలయానికి ప్రహరీ, రూ.2.65 కోట్ల టీటీడీ నిధులతో గాలిగోపురం నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్ రెడ్డి, ఈవో రాధాకృష్ణ, అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

నెల్లూరు(విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు 30 శాతం ఐఆర్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. నగరంలోని ఐఎంఏ హాలులో శుక్రవారం నిర్వహించిన ఆపస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం 117ను రద్దు చేయడమే కాకుండా ఉపాధ్యాయ బదిలీల కోసం విధివిధానాలను రూపొందిస్తోందని చెప్పారు. నూతన విద్యావిధానం ప్రకారం పాఠశా లల పునర్నిర్మాణం, ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులను విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తిచేయాలనుకోవడం శుభ పరిణామమన్నారు. ప్రభుత్వం మరింత చొరవ చూపి ఉపాధ్యాయులు ఆర్థిక ప్రయోజనాలపై కూడా దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షుడు చక్రపాణి, జిల్లా అధ్యక్షుడు కే రాజగోపాలాచార్యులు, ప్రధాన కార్యదర్శి పీ అనిల్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి మణికంఠకాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రమౌళి, రాము, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	103
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	190
స్కిన్‌లెస్	210
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8477
వెండి కిలో ధర	రూ. 103,500
వెండి ఒక గ్రాము	రూ.106.50

రామలింగేశ్వరుడి సేవలో జిల్లా న్యాయాధికారి

విడవలూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థంలో వెలసివున్న కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామిని 8వ అదనపు జిల్లా న్యాయాధికారి గీత దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో రామకృష్ణ, సిబ్బంది వెంకటేశ్వర్లు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

నేత్రదానం

విడవలూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరుకు చెందిన పద్మావతి(72), విడవలూరుకు చెందిన బెజవాడ శివకోటారెడ్డి(72) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. మృతుల నేత్రాలను మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కుటుంబసభ్యులు దానం చేశారు. నేత్రాలను నెల్లూరు మోడరన్ ఐ ఆసుపత్రి టెక్నీషియన్లు వేణు, వెంకటేశ్వర్లు సేకరించారు.

హాస్టల్ విద్యార్థులకు చేతి గడియారాల పంపిణీ

కోవూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు సభ్యులు శుక్రవారం చేతి గడియారాలు పంపిణీ చేశారు. ట్రైనీ డీఎస్పీ శివప్రియ వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రంగనాథగౌడ్, ట్రస్టు సభ్యులు సాయిబాబా, నాగార్జున, సత్యవతి, సైకాలజిస్ట్ డాక్టర్ నరసింహమూర్తి, ఎస్‌డబ్ల్యూవో తిరుపతయ్య, వార్డెన్లు రాంబాబు, వెంకట్రావు, నాగరాజు, పద్మ, సుప్రజ, జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.

దుస్థితిలో వంతెనలు!

- వైసీపీ పాలనలో ఇసుకాసురుల పాపం
- కూలిన బ్రిడ్జీలు దిష్టిబొమ్మల్లా దర్శనం
- 4 ఏళ్లుగా ప్రమాదపుటంచుల్లో ప్రయాణం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో విచ్చలవిడిగా సాగిన ఇసుక అక్రమ రవాణా కారణంగా మండలంలోని పలు వంతెనలు కూలి దుస్థితికి చేరాయి. ప్రస్తుతం దిష్టిబొమ్మల్లా దర్శమిస్తున్న ఆ వంతెనలపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. దీంతో నాలుగేళ్లుగా వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదపుటంచున బిక్కుబిక్కు మంటూ ప్రయాణం సాగిస్తున్నారు. మండలంలో పలుచోట్ల అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లు నుంచి నిత్యం వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లు, టర్బో లారీలతో 5 టన్నుల నుంచి 80 టన్నుల వరకు నిబంధలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరిగింది. ఈ వాహనాల ధాటికి ఆయా మార్గాలలోని రోడ్లు కుంగి ధ్వంసవ కావడంతో పాటు పెద్దపెద్ద గోతులు ఏర్పడి ఛిద్రం అయ్యాయి. దీంతో పాటు నీటిపారుదల శాఖ, ఆర్‌అండ్‌బీ శాఖల పరిధిలో బ్రిడ్జీలు, కల్వర్టులు కూలిపోయాయి. అయితే అప్పట్లోనే జగన్ సర్కార్ కూలిన బ్రిడ్జీలు, కల్వర్టుల స్థానంలో కొత్తవి మంజూరు చేసి నిర్మాణాలు చేపడతామని ప్రగల్భాలు పలికారు. కానీ ఒక్క రోడ్డు గానీ ఒక్క బ్రిడ్జీగాని కొత్తగా నిర్మించిన పాపానపోలేదు. కనీసం తట్టడు మట్టేసి తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టలేదు. దీంతో దెబ్బతిన్న రోడ్లు, కూలిన బ్రిడ్జిల ప్రాంతల్లో ప్రజలు, రైతులు వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులపై మొన్నటి వరకు దుమ్మెత్తి పోశారు. కూలిన బ్రిడ్జీలు, కల్వర్టుల ప్రాంతాల్లో గత 4 ఏళ్లుగా వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులు, నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు అలా ఇబ్బందులు పడుతున్నారు.



కాళయకాగొల్లు వద్ద కోవూరు కాలువ పై ధ్వంసమైన బ్రిడ్జీ

మండలంలోని మినగల్లు, కాళయకాగొల్లు, దామరమడుగు, పెనుబల్లి, జొన్నవాడ ప్రధాన బ్రిడ్జితోపాటు బుచ్చి, జొన్నవాడ మీదుగా నెల్లూరు వరకు, బుచ్చి నుంచి దగదర్తి వరకు చెన్నూరురోడ్డు, బుచ్చినుంచి నెల్లూరు వరకు ముంబై హైవే, బుచ్చి రాజుపాళెం మార్గం, పెనుబల్లి నుంచి కాళయ కాగొలు మీదుగా హైవే వరకు రోడ్డు మార్గాలు అధ్వానంగా మారాయి. బ్రిడ్జీలు, కల్వర్టులు దారుణంగా దెబ్బతిని కుప్ప కూలాయి. పాత మినగల్లు వద్ద కనిగిరి రిజర్వాయర్ సదరన్ చానెల్‌పై 4 ఏళ్ల క్రితం బ్రిడ్జి కూలిపోయింది. దీంతో తాత్కాలిక డైవర్షర్‌పై రాకపోకలు సాగిస్తున్నారు. కాళయకాగొల్లు వద్ద కోవూరు కాలువపై బ్రిడ్జి ధ్వంసమైంది. మరో 15 వరకు కల్వర్టులు, బ్రిడ్జిలు దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. కాగా గత ప్రభుత్వానికి ఇసుక టెండర్ల ద్వారా వచ్చిన ఆదాయం కన్నా దెబ్బతిన్న రోడ్లు, కూలిన బ్రిడ్జిలు, కల్వర్టులతో అంతకంటే ఎక్కువగా భారీ నష్టం వాటిల్లిందని ఆయా శాఖల అధికారులు అంటున్నారు.



పాత మినగల్లు వద్ద కనిగిరి రిజర్వాయర్ సదరన్ చానెల్‌పై 4 ఏళ్ల క్రితం కూలిన బ్రిడ్జి

● మరమ్మతుల పేరుతో ఫ్లడ్ నిధులు స్వాహా

20221లో వచ్చిన పెన్నా వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల కోసం సుమారు రూ. కోట్ల నిధులు మంజూరయ్యాయి. కానీ ఒక్క బ్రిడ్జి, రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేకపోగా పనులు చేయకుండానే నిధులు స్వాహా చేశారు. దీనిపై అప్పట్లోనే వైసీపీ నాయకులే బహిరంగంగా ఆరోపణలు చేయడం గమనార్హం. ఇప్పటికైనా కూలిన బ్రిడ్జిల స్థానంలో కొత్త బ్రిడ్జిలు, కల్వర్టులు నిర్మించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

సర్వేపల్లికి పట్టిన దరిద్రం కాకాణి

● అసభ్య పదజాలంపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు

వెంకటాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి నియోజకవర్గానికి పట్టిన అష్టదరిద్రం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డేనని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శించారు. కాకాణి అసభ్య పదజాలంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం దళిత ద్రోహి కాకాణి అంటూ నిరసన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై కాకాణి దిగజారుడు భాషను తీవ్రంగా ఖండించారు. రూ.కోట్లాది విలువైన దళితుల భూములను ఆక్రమణ, టీడీపీ నేత ఆస్తుల ధ్వంసం, ఉదయగిరి నారాయణను లాకప్‌డెత్ చేయించడం, ఈ నేరాల నుంచి తప్పించుకోవడం ఎలా అనే అంశంపై కాకాణికి డాక్టరేట్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.



కాకాణిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

వైభవంగా వేణుగోపాలుడి రథోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచేడులో జరుగుతున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్ల రథోత్సవం వైభవంగా జరిగింది. రథంలో కొలువుదీరిన స్వామి అమ్మణ్ణులు గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళమేళాలు, కోలాట భజనలు, భక్తుల గోవింద నామ స్మరణలతో పంచేడు గ్రామం మార్మోగింది. బొమ్మ శరత్‌కుమార్‌రెడ్డి, ప్రశాంతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పంచేడులో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి రథం లాగుతున్న భక్తులు

చిన్నారుల హోలీ సంబరాలు



రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతున్న చిన్నారులు

మనుబోలు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో శుక్రవారం పిల్లలు, పెద్దలు హోలీ సంబరాలు జరుపుకున్నారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో చిన్నారులంతా ఒక్కచోట చేరి రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వైభవంగా కామాక్షితాయి నిత్య కల్యాణోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జొన్నవాడ ఆలయంలో శుక్రవారం గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామికి శుక్రవారం నిత్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి నవావరణ పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి సామూహిక కుంకమార్చన నిర్వహించారు. అనంతరం పల్లకిలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

కాంతమ్మ ఆశ్రమంలో చండీయాగం

పొదలకూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇనుకుర్తిలో ఉన్న కాంతమ్మ అమ్మవారి ఆశ్రమంలో శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని చండీయాగం నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణాలు, మూలమంత్ర జపములు పఠించారు. పవిత్ర హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. ఉభయకర్తలుగా పులిమి నరేంద్ర, మోహనలతు వ్యవహరించారు.

రెండిళ్లల్లో చోరీ

కోవూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వీధిలో గురువారం రాత్రి రెండిళ్లల్లో చోరీ జరిగింది. వివరాల మేరకు.. స్థానిక హాస్పిటల్ పక్క వీధిలో నివాసముంటున్న మారుబోయిన వరప్రసాద్, మంచాల వెంకటేశ్వర్లు గురువారం ఇళ్లకు తాళాలు వేసి బంధువల ఇళ్లకు వెళ్లారు. ఇంట్లో ఎవ్వరూ లేని విషయాన్ని గుర్తించిన దొంగలు తాళాలు పగులగొట్టి బీరువాల్లో దాచుకున్న సామగ్రిని దోచుకుని వెళ్లారు. అదే ప్రాంతంలో నివాసముంటున్న వెలిచర్ల రేవంత్ ఇంటి ఆవరణలోని మోటారు బైక్‌ను అపహరించుకు వెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఘటనాస్థలాల్ని ట్రైనీ డీఎస్పీ శివప్రియ పరిశీలించి కేసు నమోదు చేశారు.



బీరువాను పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ శివప్రియ

జనసేన జెండా ఆవిష్కరణ

మనుబోలు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మనుబోలు ఆ పార్టీ జెండా ఆవిష్కరించారు. కోదండరామపురం ఆటో సెంటర్ నుంచి మనుబోలు గ్రామం వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని కాగితాలపూరు, వెంకన్నపాళెం, మడమనూరు, చెర్లోపల్లి గ్రామాల నుంచి భారీగా జనసైనికులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్, ఉపాధ్యక్షులు పెనుబాక పవన్, కదీర్, అధికార ప్రతినిధి ఖాదర్‌వలీ, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ జాకీర్, నాయకులు పెనుబాక మహేష్, జలీల్, వీరమహిళ వాణిభవాని తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుల సంబరాలు

పొదలకూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసినేటి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని పంచాయతీ బస్టాండులో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పిఠాపురంలో జరిగిన జయకేతనం సభను వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు విష్ణు, ఆనంద్, చిన్నయ్య, బాబ్జి, రోహిత్; యశ్వంత్, విజయ్, శశి, తదితరులు పాల్గొన్నారు.



మనుబోలులో జనసేన పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

4 ఏళ్ల 'రేషన్' సమస్య పరిష్కారం

● ఎమ్మెల్యే వేమిరెడ్డి చొరవతో పంపిణీ పునరుద్ధరణ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామమడుగు గుంటకట్ట ప్రాంతంలో 4 ఏళ్ల నుంచి నెలకొన్న రేషన్ సరుకుల సమస్య ఎట్టకేలకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో పరిష్కారమైంది. ఈ మేరకు శుక్రవారం ఎండీయూ వాహనం గ్రామానికి చేరుకుని లబ్దిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఈ గ్రామంలో 2021లో సంభవించిన పెన్నా వరదలతో దామరమడుగులో రేషన్ సరుకులు తడిసి పనికిరాకుండా పోయాయి. అప్పటి నుంచి గుంటకట్ట, ఆర్ఆర్ నగర్, పల్లిపాళెం, కాలువకట్ట ప్రాంతాల్లో రేషన్ సరుకులు సక్రమంగా అందక లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గతంలో ఎవరి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న నాథుడు లేరు. దీంతో ఈ సమస్యను ఇటీవల ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేశారు. దీంతో స్థానిక టీడీపీ నాయకులు చేజర్ల మహేష్, రియాజ్, శేషు, ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి శేషయ్య, మైనారిటీ మహిళ ఖుషీద్ తదితరులు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు.



దామరమడుగు గుంటకట్ట ప్రాంతంలో లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో!

మనుబోలు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురివిందపూడి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. జాతీయరహదారి నుంచి సుమారు 2.5 కి.మీ మేర రహదారి ఇలానే ఉంది. ఈ రహదారి గుండానే నిత్యం గురివిందపూడి, ఇడిమేపల్లి గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గతేడాది ఎన్నికలకు రెండు నెలల ముందు రోడ్డు వేసేందుకు అప్పటి ప్రభుత్వం ఉన్నరోడ్డును తొలగించింది. తరువాత ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో నెలలు గడుస్తున్నా రోడ్డు పనులు పూర్తి చేయనేలేదు. నిత్యం రాళ్లు తేలిన రహదారిపై ప్రయాణం నరకంగా ఉంటోందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి తమ గ్రామానికి రోడ్డు వేయాలని గురివిందపూడి గ్రామస్థులు కోరుతున్నారు.



రాళ్లు తేలి ఉన్న గురివిందపూడి రహదారి

C.R.I.M.E N.E.W.S

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా

● తప్పిన ప్రమాదం



కావలి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డులోని భారత్ గ్యాస్ ఏజన్సీ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం కారు ఢీకొని బోల్తా పడింది. స్థానికుల, వాహనదారుల వివరాల మేరకు.. మద్యం మత్తులో ఉన్న వ్యక్తి కావలి నుంచి తుమ్మలపెంట వైపునకు వాహనాన్ని అతివేగంగా నడిపి ప్రమాదానికి కారణ మైనట్లు తెలిపారు. ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగిపోవటంతో పాటు 11కేవీ ఎల్‌టీ లైన్ వైర్లు తెగిపోయాయి. ఆ సమయంలో ఎదురుగా వాహనాలు రాకపోవటం, విద్యుత్ లైన్ల కింద ఎవరూ లేక పోవటంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులోని వ్యక్తి పరారయ్యాడు. ఈ ప్రమాదంతో విద్యుత్‌శాఖకు రూ.15వేల మేర ఆస్తి నష్టం జరిగినట్లు ఈమేరకు 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

హైవేపై స్పిరిట్ ట్యాంకర్ లారీ బోల్తా

● ట్రాఫిక్‌కు అంతరాయం



బోల్తాపడిన స్పిరిట్ లారీ ట్యాంకర్‌ను పైకి లేపుతున్న క్రేన్లు

వెంకటాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం స్పిరిట్ ట్యాంకర్ లారీ బోల్తాపడింది. వివరాల మేరకు.. నెల్లూరు నుంచి గూడూరు వైపు స్పిరిట్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్ లారీ అదుపు తప్పి బోల్తాపడింది. ఈప్రమాదంలో లారీ వెనుకభాగంలో ఉన్న ట్యాంకర్‌లోని స్పిరిట్ అంతా రోడ్డుమీదకు చేరింది. పెనుప్రమాదం జరగకముందే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. బోల్తాపడిన లారీ ట్యాంకర్‌ను క్రేన్ల సాయంతో పైకి లేపారు. స్పిరిట్ లారీ బోల్తాపడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్‌కు రైల్వే సీఐ

నెల్లూరు(క్రైం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తోటి సిబ్బంది ఫిర్యాదులు, అవినీతి ఆరోపణల నేపథ్యంలో నెల్లూరు జీఆర్‌పీ సీఐ భుజంగరావును ఉన్నతాధికారులు వీఆర్‌కు బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. 2023 సెప్టెంబరులో నెల్లూరు రైల్వే సీఐగా భుజంగరావు బాధ్యతలు చేపట్టారు. కొంతకాలంగా ఆయనపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నేరుగా సీఎం, డిప్యూటీ సీఎం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో రైల్వే ఎస్పీ రాహుల్ మీనా నేరుగా రంగంలోకి దిగారు. నెల్లూరు జీఆర్పీ స్టేషన్‌కు చేరుకుని విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఈక్రమంలో సీఐ భుజంగరావును వీఆర్‌కు పిలుస్తూ ఉత్తర్వులు జారీచేశారు. శనివారం ఆయన రిలీవ్ కానున్నారు.

'వైసీపీ నేత దౌర్జన్యం చేస్తున్నారు'

నెల్లూరు(క్రైం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత మొయిళ్ల సురేష్‌రెడ్డి తమపై దౌర్జన్యం చేస్తున్నారని వాదనాల రాజేష్ అనే వ్యక్తి ఆరోపించారు. శుక్రవారం నెల్లూరులోని కల్యాణ్ నగర్‌లో గల తన స్థలం వద్ద రాజేష్ విలేకర్లతో మాట్లాడారు. జీవీఆర్‌ఆర్ కళాశాల వద్ద 2022లో స్థలం కొనుగోలు చేశానని, అయితే ఆ స్థలంలోకి వైసీపీ నేత మొయిళ్ల సురేష్‌రెడ్డి వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. 62 అంకణాల స్థలానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నాయని, అయినా సురేష్‌రెడ్డి బెదిరిస్తున్నారని ఆరోపించారు. తాము దళితులం కావడంతో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. సురేష్‌రెడ్డి మూలంగా తమ కుటుంబం ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసీపీ నేత ఆనం విజయకుమార్‌రెడ్డి ఈస్థలం వద్దకు వచ్చి అవాస్థవాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా ఆస్థలానికి సంబంధించి ఇరువురిని పత్రాలు తీసుకురావాలని సూచించామని, ఆ పత్రాలను రెవెన్యూ శాఖకు పంపి రికార్డులు పరిశీలించమని కోరుతామని చెప్పారు.

రౌడీషీటర్ దారుణ హత్య

రక్తపు మడుగులో మృతదేహం

భయంతో పరుగులు తీసిన ప్రజలు



మృతుడు చింటూ (ఫైల్)

నెల్లూరు(క్రైం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర ప్రజలు మరో సారి ఉలిక్కిపడ్డారు. నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఉడ్‌హౌస్ సంఘంలో ఇటీవల జరిగిన దారుణ హత్యను ఇప్పుడిప్పుడే మరిచిపోతున్న నగరవాసులకు వేదాయపాళెం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన దారుణ హత్య భయభ్రాంతులకు గురిచేసింది. రౌడీషీటర్ చింటూ దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. పాత వేదాయపాళెనికి చెందిన ఏ సుజన్ కృష్ణ అలియాస్ చింటూ(24) పలు హత్య, హత్యాయత్నం కేసుల్లో నిందితుడు. అతనిపై వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. కొంతకాలంగా కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటున్న చింటూ శుక్రవారం రాత్రి పొదలకూరురోడ్డు జడ్పీ హైస్కూల్ సమీపంలోని ఇందిరాగాంధీ నగర్ రెండో వీధికి వచ్చాడు. ఈ క్రమంలోనే గుర్తుతెలియని కొందరు యువకులు కత్తులతో దారుణంగా నరికి హత్య చేసి పరారయ్యారు. విచక్షణా రహితంగా తల నుంచి కింద వరకు నరకడంతో చింటూ అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య జరిగిన ప్రాంతం రక్తపు మడుగయ్యింది. సమాచారం అందుకున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఫోన్‌చేసి పిలిపించి చింటూను దారుణంగా హత్య చేశారని ప్రాథమిక సమాచారం. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



మాగుంటలేఅవుట్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీనారాయణ కల్యాణోత్సవం



ఇస్కాన్‌లో అభిషేకం చేస్తున్న సుఖదేవ స్వామి, ఎస్పీ సతీమణి ప్రణవ్ గౌతమి



↑ మండపాల వీధిలో హోలీ సంబరాల్లో చిన్నారులు

ఉత్సాహంగా హోలీ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా హోలీ పండుగ వేడుకలు శుక్రవారం నగరంలో సంద డిగా జరిగాయి. యువతీ యువకులు రంగులు చల్లుకుంటూ ఈ వసంతో త్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

- వీఆర్ హైస్కూల్ మైదానంలో ఓ ఈవెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేసింది.
- మండపాల వీధి, ఆచారి వీధి, కాపువీధుల్లోని మార్వాడీలు సంప్రదా యబద్ధంగా హోలీ వేడుకలు జరుపుకు న్నారు. అనంతరం మహావీర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.
- పొదలకూరు రోడ్డు సూర్యా స్కూల్‌లో బాలభవన్ ఆధ్వర్యం లో హోలీ వేడుకలు జరిగాయి. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి హో లీ పండుగ విశిష్టత, రంగుల గురించి విద్యార్థులకు వివరించారు.



సూర్య స్కూల్‌లో బాలభవన్ ఆధ్వర్యంలో జరిగిన హోలీ వేడుకల్లో రంగులు చల్లుతున్న విద్యార్థి

● ఆలయాల్లో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు

- మాగుంట లే అవుట్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహా లక్ష్మీ జన్మదిన వేడుకలు జరిగాయి. ఉదయం మహాలక్ష్మీ హోమం నిర్వ హించారు. రాత్రి పల్లకీసేవ కన్నుల పండువగా జరిగింది. నవాబుపేట, ఫత్తేఖాన్‌పేట, మూలాపేటల్లోని మహాలక్ష్మీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.
- ఇస్కాన్ మందిరంలో గౌర పూర్ణిమ సందర్భంగా అభిషేకాలు, కీర్త నలు హారతులు జరిగాయి. మందిరం అధ్యక్షుడు సుఖదేవ స్వామి మాట్లా డుతూ కలియుగంలో హరినా మ సంకీర్తన ముక్తికి ఏకైక మార్గం అన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సతీమణి ప్రణవ్ గౌతమి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో లక్ష్మీదేవి జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా స్వర్ణ మహాలక్ష్మీ అమ్మవారికి పంచా మృతాభిషేకాలు, నాణేలతో అభిషేకం, లక్ష కుంకుమార్చన, రుద్ర హో మం, అష్టలక్ష్మీ హోమం జరిగా యి. రాత్రి స్వర్ణ మహాలక్ష్మికి పల్లకీసేవ వైభ వంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాలను ఆలయ మేనేజిం గ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు పర్యవేక్షించారు.
- రాజరాజేశ్వరి ఆలయంలో చండీహోమం, రాహుకాల పూజలు జరి గాయి. రాత్రి అమ్మవారికి కుంభహారతులు, పల్లకీ ఉత్సవం జరిగాయి. మూలాపేట శంకరమఠంలో చండీ హోమం జరిగింది.
- మహాత్మాగాంధీనగర్ కృష్ణ మందిరం, నవాబుపేట ఆల యాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి.



అష్టలక్ష్మీ ఆలయంలో బంగారు చీర అలంకరణలో స్వర్ణ మహాలక్ష్మి అమ్మవారు

భక్తిశ్రద్ధలతో లలితా సహస్ర నామ పారాయణం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా సాయంత్రం సామూహిక లలితా సహస్రనామ పారాయణం జరిగింది. ఉదయం రాహుకాల పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాహుకాల దీపాలు వెలిగించారు. పలువురు ఉద్యాపన పూజలు చేశారు. రాత్రి కుంభ హారతులు, పల్లకీసేవ జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.



రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో రాహుకాల దీపాల ఉద్యాపన పూజలు చేస్తున్న అర్చకులు

ఈ రోడ్డు ఏందయ్యా!

- ఆక్రమణలతో నిండిన పాత బైపాస్
- రోడ్లపైనే ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్
- ఎక్కడ పడితే అక్కడ ఇంటి నిర్మాణ సామగ్రి
- అవస్థలు పడుతున్న వాహనచోదకులు

ఒకవైపు రోడ్డు పొడవునా వాహనాల పార్కింగ్, మరోవైపు ఎక్కడ పడితే అక్కడ భవన నిర్మాణ సామగ్రి, ముందుకొచ్చిన అంగళ్లు, ఇవి చాలవన్నట్లు బండ్ల మీద వ్యాపారాలు..... వెరసి నగరంలోని పాత బైపాస్ రోడ్డు అసౌకర్యాలు, ఆక్రమణలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి పోయింది. నగరంలోని ముఖ్య రహదా రుల్లో ఇదీ ఒకటి. సంతపేట నుంచి బట్వాడిపాళెం వరకు విస్తరించిన ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడం వాహన చోదకులకు సవాలుగా మారుతోంది.



గుప్తా పార్కు వద్ద రోడ్డుపై వాహనాల పార్కింగ్, మరోవైపు చెరకురసం అంగడి



సంతపేటలో రోడ్డుకు ఇరువైపులా నిలిపిన వాహనాలు

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలా పేట ప్రాంతానికి వెనుక వెళ్లే రహదారి ఒకప్పుడు బైపాస్‌రోడ్డు. దీనినే వాకర్స్ రోడ్డు అని కూడా పిలుస్తారు. చుట్టు పక్కలంతా నివాస ప్రాంతాలు కావడంతో ఈ రహదారి మీదుగా నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కానీ, వాహ నాల పార్కింగ్, వస్తుసామగ్రి నిల్వ చేయడం వల్ల రోడ్డు కుంచించుకుపోయి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సాధారణంగా ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుక, ఇటుక, కంకర, ఇనుము వంటివి రోడ్డుపైన దించుకుంటూ ఉంటారు. అయితే ప్రధాన రహదారి అయిన వాకర్స్ రోడ్డుపై కూడా ఇలా ఇంటి సామగ్రి నిల్వ చేయడంతో 25శాతం రోడ్డును అవి ఆక్రమించేస్తున్నాయి. ఇక, ఆటో డ్రైవర్లు అయితే వెనుక వచ్చే వాహనాలను పట్టించుకో కుండా ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపి ప్రయాణికు లను దించడం, ఎక్కించు కోవడం చేస్తున్నారు. దీని వల్ల మిగిలిన వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. అదే సమయంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్

నెల్లూరు నగర ప్రధాన రహదారి మీదుగా సంతపేటకు వెళ్లాలంటే ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని ఎక్కువ మంది విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనుల మీద వెళ్లే వారు పాత బైపాస్ రోడ్డును ఆశ్రయిస్తారు. అలాగే, ఆత్మకూరు బస్టాండు నుంచి సంతపేట మీదుగా పుత్తాఎస్టేట్, పరమేశ్వరినగర్, గేటు సెంటర్ మీదుగా మూలాపేటకు వెళ్లడానికి ఇదే రహదారి. అయితే సంతపేట ప్రభుత్వ బీఈడీ కళాశాల, గుప్తాపార్కు సమీపంలో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఈరోడ్డు కేవలం పార్కింగ్ కోసమే అన్నట్లుగా అక్కడి పరిస్థితి ఉంటోంది.



గేటు సెంటర్ సమీపంలో ఓవైపు ఇంటి నిర్మాణ సామగ్రి, మరోవైపు సోడా బండి

సంతపేట వ్యాపార కూడలి కావడంతో వాహనాలతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. రోడ్లపైనే వాహనాలు నిలిపి వ్యాపారాలు సాగిస్తుంటారు. పెద్ద వాహనాలు వచ్చాయంటే ఇక ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయమే!. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓల్డ్ బైపాస్ రోడ్డుపై వాహన రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

ఆర్టీసీ కాలనీలో హోలీ సంబరం

నెల్లూరు(విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : బుజబుజనెల్లూరు ఆర్టీసీ కాలనీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం హోలీ సంబరాలు జరి గాయి. ఐక్యవేదిక కార్యదర్శి గుంటి కృష్ణకిశోర్ మాట్లాడుతూ సత్య యుగం నుంచి హోలీ పండుగ జరుపుకుంటున్నాటా రన్నారు. ఈ సందర్భంగా కాలనీలోని చిన్నారు లందరూ కలిసి ప్రతి ఇంటికి వెళ్లి హోలీ విశిష్టతను తెలియచేస్తూ వారికి రంగులు పూసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు ఈశ్వరన్, మురళి, శ్రీలక్ష్మి, డింకు, రక్షిత, లక్ష్మీప్రియ, రక్షిత, స్పందన, మనస్విని, నేహ తదితరులు పాల్గొన్నారు.



హోలీ సంబరాల్లో చిన్నారులు

సౌత్ మోపూరు పీహెచ్‌సీలో రూ.50 లక్షలతో ల్యాబ్ నిర్మాణం

నెల్లూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలకు రూ.50 లక్షలతో ల్యాబ్ నిర్మించనున్నారు. దీనికి టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయని చెప్పారు. పీహెచ్‌సీలో ల్యాబ్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువ స్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్లు వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, నాయకులు రాపూరు శేఖర్, పముజుల ప్రదీప్, సుధాకర్, రామయ్య తదిత రులు పాల్గొన్నారు.

'శుభమస్తు'లో డబుల్ ఆఫర్లు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : శుభమస్తు షాపింగ్ మాల్‌లో ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా డబుల్ ఆఫర్లు అందిస్తు న్నట్లు ఆ మాల్ యాజమానులు భయ్యా శ్రీనివాసులు, రవికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంత మొత్తానికి షాపింగ్ చేస్తే అంత మొత్తానికి డిస్కౌం ట్ పాయింట్లు ఖాతాదారులు పొందుతారని తెలిపారు. దీంతో వినియోగదారులు 100 శాతం ఫ్రీ షాపింగ్ చేసుకో వచ్చన్నారు. పలు రకాల వస్త్రాలు డిస్కౌంట్ ధరల్లో లభిస్తున్నాయని పేర్కొన్నారు.

జూలై 30న జీజీహెచ్‌లో క్రిటికల్ కేర్ యూనిట్ ప్రారంభం

● దీని కోసం రూ. 24 కోట్ల ఖర్చు ● భవనం పరిశీలనలో ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జూలై 30వ తేదీన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ అందుబాటు లోకి వస్తుందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. జీజీహెచ్‌లో నిర్మాణంలో ఉన్న ఆ యూనిట్ భవనాన్ని శుక్ర వారం ఎమ్మెల్యే పరిశీలిం చారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, అవసరమైన వైద్య పరికరాలు కూడా క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఏర్పాటు చేయాలని ఏపీఎంఎస్‌ఐడీసీ అధికారులకు సూచించారు. 50 పడకలు, అత్యాధునిక వసతులతో ఈ క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటవుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ శ్రీని వాసులు, సభ్యులు మల్లికార్జున, మొగరాల సురేష్, బ్రహ్మారెడ్డి, జీజీ హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్ట ర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



జీజీహెచ్ క్రిటికల్ కేర్ భవనం వద్ద ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

టౌనుహాలులో పోషకాహారం పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని టౌను హాలులో శుక్రవారం షెల్టర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగులు, చిన్నారులకు పోష కాహారం పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన డేవిడ్ దయాసాగర్ మాట్లాడుతూ సేవ చేయడం, సహాయపడటం ప్రతి ఒక్కరు బాధ్యతగా భా వించాలని కోరారు. ట్రస్ట్ ప్రతినిధులు మాట్లా డుతూ ఈ సేవా కార్యక్రమం ప్రతి నెల నెల్లూ రు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ జయ ప్రకాష్, సాల్మన్, శివకుమార్, స్టీఫెన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

నెల్లూరు (హరనాథపురం) మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లిస్తు న్నట్లే, విశ్రాంత ఉద్యోగులకు కూడా బకాయిల ను వెంటనే చెల్లించి న్యాయం చేయాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసి యేషన్ అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ ఓ ప్రకట నలో ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగులకు రూ.5 వేల కోట్ల బకాయిలు చెల్లించడానికి ముఖ్యమం త్రి చర్యలు తీసుకోవడం హర్షదాయకమన్నారు. అలాగే వృద్ధాప్యంలో, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న విశ్రాంత ఉద్యోగులకు కూడా పీఆర్సీ, డీఆర్ బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. గత ఆరు నెలలుగా మట్టి ఖర్చులకు చెల్లించాల్సిన రూ.25వేలు కూడా చెల్లించకపో వడంతో వందలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు.

శ్రీవారి కల్యాణానికి సీఎంకు ఆహ్వానం

నెల్లూరు (హరనాథపురం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలోని వెంకట పాలెంలో శనివారం జరగనున్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొనాలని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ను టీటీడీ చైర్మన్ బీఆర్ నా యుడు, బోర్డు సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆహ్వానించారు. శుక్రవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో వీరు చంద్రబాబును కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలారావు తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బీఆర్ నాయుడు, ప్రశాంతిరెడ్డి తదితరులు

అంతిమయాత్ర వాహనం ప్రారంభం


నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పుండ్ల వెంకురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించే అంతిమయాత్ర వాహనాన్ని శుక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి ప్రారంభించారు. పవిత్రమైన అంతిమ యాత్రకు నిరుపేద కుటుంబాలకు ఉచితంగా వాహనాన్ని అందిస్తున్న వెంకురెడ్డి చారిట బుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. ఈ వాహనం కోసం 9182735449 నెంబరు ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రేపు 'విశాలాక్షి' సాహిత్య సదస్సు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షి మాస పత్రిక సాహి త్య సదస్సు, బహుమతి ప్రదానోత్సవం ఆదివారం సాయంత్రం జరుగుతుందని 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయ చాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సదస్సు గోడ పత్రికలు ఆవిష్కరించారు. పత్రిక నిర్వాహకుడు కోసూరు రత్నం మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా రూ.లక్ష పదివేలతో నాలుగు విభాగాలలో బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపా రు. కార్యక్రమంలో పత్రిక సంపాదకుడు ఈతకోట సుబ్బారావు, అమీర్‌జాన్, దంపూరు రామకృష్ణ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

యాదవ ఎంప్లాయీస్ సొసైటీ అధ్యక్షుడిగా రవీంద్ర

నెల్లూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా యాదవ ఎంప్లా యిస్ సొసైటీ తాత్కాలిక అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్ రవీంద్ర, పల్లా శ్రీని వాసులును ఎన్నుకున్న ట్లు సొసైటీ వ్యవస్థాప కుడు దామిని బోయిన వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం నగరంలో ఆ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీ అభివృ ద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, పులి జగదీష్, కాళ్ల వెంకటేశ్వర్లు, గుమ్మడి శ్రీనివాసులు, మన్మధరావు, మురళీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు



హోలీ.. రంగుల కేళీ



జిల్లాలో హోలీ సందర్భంగా శుక్రవారం రంగులు చల్లుకున్నారు. తిరుపతి బజారువీధి, ఇతర ప్రాంతాల్లోని మార్వాడీలు రంగులు పూసుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. శిల్పారామంలో రంగులు చల్లుకునేందుకు.. పిల్లలు ఆటలాడేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అక్కడికి చేరుకున్న పలువురు స్థానికులు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. శ్రీకాళహస్తి, గూడూరు, నాయుడుపేట, పుత్తూరు, సత్యవేడు, సూళ్లూరుపేట ప్రాంతాల్లోనూ మార్వాడీలు.. వివిధ ప్రాంతాల్లో పనిచేసేందుకు వచ్చిన ఉత్తరాది వారూ హోలీ సంబరాల్లో మునిగి తేలారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ప్రకృతి ఒడిలో కాలినడకన కుమారధార తీర్థ యాత్ర


- ముక్కోటికి పోటెత్తిన భక్తజనం
- పటిష్టంగా టీటీడీ ఏర్పాట్లు






ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని చెట్లు నడుమ రాళ్లురప్పలు దాటుతూ, భారీ లోయల్లోకి దిగుతూ, ఎక్కుతూ శేషాచల కొండల్లోని కుమారధార తీర్థానికి శుక్రవారం భక్తజనం పోటెత్తారు. ప్రతి ఏడాది పాల్గుణ పౌర్ణమినాడు టీటీడీ కుమారధార తీర్థముక్కోటిని నిర్వహిస్తోంది. శుక్రవారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులను తీర్థానికి అనుమతించారు. తిరుపతి, తిరుమల స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తీర్థాన్ని సందర్శించారు. లోయల్లోకి దిగుతూ, జారే బండల మీదుగా కొండలు ఎక్కుతూ సాగిపోయారు. పదేళ్ల పిల్లలు మొదలు వృద్ధుల దాకా ఈ తీర్థయాత్రలో ఉత్సాహంగా నడిచారు. అనేక చోట్ల టీటీడీ నిచ్చెనలు ఏర్పాటు చేసింది. కొన్ని చోట్ల మోకులు కట్టి పట్టుకుని నడిచే ఏర్పాటు చేశారు. పాపవినాశనం వద్ద టిఫిన్‌లు ఏర్పాటు చేశారు. దారిలోనూ నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ వంటివి ఇచ్చారు. భద్రత, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. రద్దీ పెరగడంతో అక్కడక్కడా భక్తులను ఆపేసి, పంపారు. ముఖ్యంగా తీర్థం వద్ద ఎక్కేందుకూ దిగేందుకూ ఒక్కటే నిచ్చెన దారి ఏర్పాటు చేయడంతో గంటన్నర పాటు భక్తులు ఆగిపోవాల్సి వచ్చింది. శుక్రవారం దాదాపు ఆరు వేల మంది కుమారతీర్థానికి నడిచి కుమార స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







'హరియాణా' మద్యం వెనుక ఇంకా ఎవరున్నారు?

- పాత్రధారులపై ఆరా తీస్తున్న ఎక్సైజ్ అధికారులు
- ముమ్మరంగా సాగుతున్న దర్యాప్తు

తిరుపతి(నేరవిభాగం) మార్చి 14(ఆంధ్రజ్యోతి): హరియాణా మద్యం వెనుక ఇంకా పాత్రధారులు ఎవరున్నారు? గజేంద్రశర్మ ఒక్కడే ఇంత భారీగా మద్యం తీసుకొచ్చి అమ్మకాలు జరపగలడా? ఇన్నాళ్లుగా మద్యం దందా బయటపడకుండా ఎలా చేయగలిగాడు? ఇతడికి పరోక్షంగా సహకరిస్తున్న వాళ్లు ఎవరైనా ఉన్నారా? ఈ కోణాల్లో ఎక్సైజ్ అధికారులు విచారిస్తున్నారు. గూడూరు, తిరుపతే కాదు.. తమిళనాడులోని తిరుత్తణి, వేలూరు ప్రాంతాల్లోనూ హరియాణా మద్యం విక్రయాలు జరిపినట్లు ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ఈ అంశాన్ని శుక్రవారం తిరుమలకు వచ్చిన ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి అధికారులు తీసుకెళ్లినట్లు తెలిసింది.

'మనకు తెలియకుండానే జిల్లాకు హరియాణా నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం ఎలా వస్తోంది' అని మంత్రి ప్రశ్నించినట్లు సమాచారం. ఈ క్రమంలో సమగ్ర విచారణకు ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ ఆదేశించారు. ప్రస్తుతం మద్యం విక్రయాల్లో రాష్ట్ర ప్రభుత్వం అతి తక్కువ మార్జిన్ ఇస్తుండడంతో పెట్టుబడికి వడ్డీ కూడా రావడంలేదని కొందరు నిర్వాహకులు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. వీరు హరియాణా మద్యాన్ని అతి తక్కువ ధరకు కొని.. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పీకి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో తిరుపతి నగరంలోని ఓ బార్ యజమాని, నాయుడుపేట, గూడూరులోని ఇద్దరు మద్యం దుకాణా నిర్వాహకుల పాత్రపై ఎక్సైజ్ అధికారులు విచారిస్తున్నారు. అలాగే, కొన్ని దుకాణాలను సబ్‌లీజుకు తీసుకున్న వారిలో కొందరి పాత్ర కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక, వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు.. రెండేళ్ల కిందటే హరియాణా మద్యం జిల్లాకు తీసుకురావడం మొదలు పెట్టారని సమాచారం. ఇప్పుడు హరియానా మద్యం భారీ ఎత్తున కొనుగోళ్ల వెనుక సబ్ లీజ్‌దారులు ఉండటంతో.. హరియాణాకు చెందిన ప్రధాన సూత్రధారి గజేంద్ర శర్మ విచ్చలవిడిగా ఢిల్లీ నుంచి రైళ్లలో హరియాణా మద్యం తీసుకొచ్చి గూడూరు, తిరుపతి కేంద్రంగా సరఫరా చేసినట్లు భావిస్తున్నారు. సబ్‌లీజుదారులు నేరుగా తీసుకెళ్లేవారని అంటున్నారు. దీనివల్ల ఇంత కాలం గుట్టు సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే తాజాగా ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ ఆదేశాలతో జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి, అధికారులు సంయుక్తంగా జరిపిన డెకాయ్ ఆపరేషన్‌తో హరియాణా మద్యం విక్రయాల గుట్టు రట్టయింది. ఇంకా, దీని వెనుక పాత్రధారులు ఎవరున్నారనే దానిపై దర్యాప్తు సాగుతోంది.

ట్రాక్టర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి దుర్మరణం



కేవీబీపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కొత్తూరుకు చెందిన భాస్కర్‌రెడ్డి కుమారుడు దిలీప్(17) శుక్రవారం ఉదయం సెలవు కావడంతో పొలానికి నడచి వెళుతున్నాడు. ఆ సమయంలో కొత్తూరు నుంచి తిమ్మసముద్రంవైపు వెళుతున్న ట్రాక్టర్ వెనుక నుంచి దిలీప్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ నరేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దిలీప్‌ను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దిలీప్ మృతి చెందాడు. పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి

తడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం మాండ్య పట్టణానికి చెందిన ఎంఆర్.ప్రత్యూష్(21) శ్రీసిటీలోని ట్రిపుల్ ఐటీలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ప్రత్యూష్‌తో పాటు సహచర విద్యార్థులందరూ కలిసి హోలీ జరుపుకోవాలని నిర్ణయించారు.ప్రత్యూష్ ద్విచక్ర వాహనంలో సూళ్లూరుపేటకు వెళ్లి రంగులు కొనుగోలు చేసి తిరుగు ప్రయాణమయ్యాడు. కొండూరు గ్రామం చెన్నై వెళ్తున్న లారీ ప్రత్యూష్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొని అతడిపై నుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంతో ప్రత్యూష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం రక్షణపై నిపుణుల కమిటీ సమావేశం

మంగళం, మార్చి14(ఆంధ్రజ్యోతి): శేషాచలంలోని ఎర్రచందనం సంరక్షణపై ఎన్‌బీఏ, ఏపీఎస్‌బీబీ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ నిపుణుల కమిటీ శుక్రవారం తిరుపతిలో సమావేశమైంది. ఎర్రచందనం వృక్ష సంపదను పెంపొందించడం, ఎర్రచందనాన్ని గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తెచ్చి పెట్టే అంశాలపై చర్చించారు. అక్రమ రవాణాన్ని అరికట్టడానికి అనుసరించాల్సిన విధానాలు, శేషాచలం అటవీ ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై సమీక్షించారు. జంగిల్ సఫారీ, పర్యాటక అభివృద్ధి వంటి విషయాలపై రాష్ట్ర స్థాయి అటవీ శాఖ అధికారులతో చర్చించినట్టు తెలిసింది. బయో డైవర్సిటీ అథారిటీ ఛైర్మన్ అచలేందర్ రెడ్డి, బయో డైవర్సిటీ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, కార్యదర్శి రామకృష్ణ, తిరుపతి సీసీఎఫ్ సెల్వం, బయోట్రిమ్ స్టేట్ సిల్వికల్చరిస్ట్ నరేంద్రన్, జిల్లా అటవీశాఖాధికారి వివేక్, డివిజనల్ ఫారెస్ట్ అధికారులు, క్షేత్రస్థాయి అటవీశాఖ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శనివారం) : 6.26

సహరి (ఆదివారం) : 5.01

అమెరికా కాల్పుల్లో గాయపడ్డ గోవిందపురం యువకుడు

- ఆదుకుంటామని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే బొజ్జల

శ్రీకాళహస్తి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఓ కారుపై దుండగులు జరిపిన కాల్పుల్లో ఏర్పేడు మండం గోవిందపురం పంచాయతీకి చెందిన పోతగుంట మోహన్ సాయి గాయపడ్డారు. ఇతడు అమెరికాలోని మెమ్ఫిస్ ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. భారత కాలమాన ప్రకారం గురువారం రాత్రి 11.30గంటల సమయంలో ఓ స్నేహితుడితో కలిసి కారులో ప్రయాణిస్తుండగా.. ఓ దుండగుడు వీరి కారుపై తుపాకీతో కాల్పులు జరిపాడు. దీంతో మోహన్‌సాయి కుడి భుజం, చేతిపై బుల్లెట్లు దిగడంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాపాయ స్థితిలో మోహన్ తానే కారు నడుపుకుంటూ వాలేరోకు చేరుకుని అత్యవసర సాయం కోసం టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేశారు. స్థానిక అధికారులు మోహన్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మోహన్‌సాయి తీవ్రగాయాలతో చికిత్స పొందరుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఫోన్‌లో మోహన్‌సాయి కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆర్థికసాయం అందించడంతో పాటు ప్రభుత్వపరంగా సహాయకర చర్యలు అందజేస్తామని వారికి ధైర్యంచెప్పారు. అమెరికాలోని ఎన్నారైల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సాయం చేస్తానని కుటుంబ సభ్యులకు తెలిపారు.



చికిత్స పొందుతున్న మోహన్‌సాయి

మహిళా రక్షణకు 'శక్తి యాప్'

- సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 14(ఆంధ్రజ్యోతి): మహిళా రక్షణకు శక్తి యాప్ ఉక్కు కవచంగా ఉంటుందని ఎస్పీ హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. మహిళలపై పెరిగిపోతున్న హింస, వేధింపులు, అఘాయిత్యాల నివారణకు ప్రభుత్వం ప్రారంభించిన ఈ యాప్‌ను మహిళలందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని శుక్రవారం ఆయన కోరారు. ఆపద సమయంలో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే వారున్న ప్రాంతం వివరాలు, దగ్గర్లోని పోలీసు స్టేషన్‌కు, డయల్ 112కు సమాచారం చేరుతుందన్నారు. తద్వారా వెంటనే పోలీసు సిబ్బంది సహాయం పొందవచ్చన్నారు.

డౌన్‌లోడ్ చేసుకోండిలా.. : మొబైల్‌లోని గూగుల్ ప్లే స్టోర్ ద్వారా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో వ్యక్తిగత వివరాలు నమోదు చేయాలి. మొబైల్‌కు వచ్చే ఓటీపీతో ఫోను నెంబరు అనుసంధానం చేయాలి. అత్యవసర పరిచయాలు జోడించాలి. ఏదైనా ప్రమాదం జరిగితే యాప్ ఓపన్ చేసి ఎస్ఓఎస్ బటన్ నొక్కితే మీ లొకేషన్‌ను గుర్తించి పోలీసులు వెంటనే స్పందిస్తారు. ఇక, సమీపంలోని పోలీసు స్టేషన్ల సమాచారం, హెల్ప్‌లైన్ నెంబర్లు యాప్‌లో పొందు పరుస్తారు.

షార్‌కు చేరిన ప్రొపల్లెంట్ మిక్సర్



ప్రత్యేక వాహనంలో షార్‌కు తీసుకెళ్తున్న ప్రొపల్లెంట్ మిక్సర్

సూళ్లూరుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఇటీవల 10 టన్నుల ఇంధన సామర్థ్యంతో అభివృద్ధి చేసిన ప్రొపల్లెంట్ మిక్సర్ షార్‌కు చేరింది. రాకెట్ల తయారీలో ఘన ఇంధన దశల కోసం దీనిని వినియోగిస్తారు. ఈ ప్రొపల్లెంట్ మిక్సర్‌ను బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన భారీ భద్రత నడుమ శుక్రవారం తెల్లవారుజామున షార్‌కు తీసుకొచ్చారు. రాకెట్ జీరో దశలో ఉన్న స్ట్రాపాన్లు మొదటి దశలోని ఘన ఇంధన మోటార్లకు ఇంధనం సరఫరా చేసేందుకు ఈ భారీ ప్రొపల్లెంట్ మిక్సర్ ఉపయోగపడుతుంది. ఇస్రో ప్రస్తుతం ఒకేసారి ఎక్కువ రాకెట్లు తయారీ చేస్తోంది. ఈ క్రమంలో భవిష్యత్ అవసరాల కోసం బెంగళూరులోని సెంట్రల్ మానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఎంటీఐ)తో కలిసి 10 టన్నుల సామర్థ్యం గల ఈ ఘన ఇంధన ఎర్టికల్ ప్లానిటరీ మిక్సర్‌ను ఇస్రో అభివృద్ధి చేసింది. ఈ మిక్సర్ వెడల్పు 3.3 మీటర్లు, ఎత్తు 8.7 మీటర్లు. సుమారు 150 టన్నుల బరువు ఉంటుంది. దీని తయారీ అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ. సున్నితమైన, ప్రమాదకరమైన పదార్థాలను జాగ్రత్తగా మిశ్రమం చేయాల్సి ఉంటుంది. ఈ పరిజ్ఞానం కొన్ని దేశాలకే ఉంది. రాకెట్ల ప్రయోగంలో సాలిడ్ ప్రొపల్షన్ వ్యవస్థ పాత్ర చాలా కీలకం. దేశంలో పది టన్నుల ప్రొపల్లెంట్ మిక్సర్‌ను అభివృద్ధి చేయడం ఇదే తొలిసారి. ఇకపై ఈ మిక్సర్‌ను వినియోగంలోకి తీసుకురానున్నారు.

చంద్రగిరి పంచాయతీ ఈవో సస్పెన్షన్

చంద్రగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పంచాయతీ ఈవో మహేశ్వరయ్యను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేసారు. గతవారం చంద్రగిరి ఈవో మహేశ్వరయ్య ఓ కాంట్రాక్టర్ వద్ద రూ.50 వేలు లంచం తీసుకొంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఆయన్ను అరెస్ట్ చేసి, నెల్లూరులోని ఏసీబీ కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఈ క్రమంలో మహేశ్వరయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



కన్నులపండువగా పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో శుక్రవారం పౌర్ణమి గరుడసేవ కన్నులపండువగా జరిగింది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా టీటీడీ గరుడసేవను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో శుక్రవారం మలయప్పస్వామికి విశేష అలంకరణ చేసి గరుడుడిపై వేంచేపు చేశారు. రాత్రి 7 గంటలకు మొదలైన వాహన సేవ.. నాలుగు మాడవీధుల్లో సాగింది. భక్తులు స్వామిని దర్శించుకుని కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



తిరుమలతో సంయుక్తా మీనన్

హీరోయిన్ సంయుక్తా మీనన్ శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ప్రస్తుతం రెండుమూడు సినిమాల్లో నటిస్తున్నట్టు తెలిపారు. సెప్టెంబరులో 'అఖండ 2' విడుదల కానుందన్నారు. 'స్వయంభూ' కూడా విడుదలకు సిద్ధంగా ఉందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సన్నటి పామే కానీ డేంజర్!

చాకచక్యంగా పట్టుకున్న భాస్కర్‌నాయుడు

పాము సన్నటిదే కానీ అత్యంత విషపూరితం. శుక్రవారం నాడు తిరుమల బాలాజీ నగర్‌లో ఒక బైక్‌లోకి ఎక్కేసింది. గమనించిన స్థానికులు భాస్కర్‌నాయుడుకు సమాచారం ఇచ్చారు. ఐదు అడుగులు పొడవున్న తాటికట్ల పామును ఆయన పట్టుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్వీఎన్ భట్టి




సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్‌రావు కూడా ఆయన వెంట ఉన్నారు. అలాగే తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్, మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్ కూడా వేరువేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ లక్ష్మణ్‌రావు

నేడు స్లీపింగ్ డే



రాత్రంగా నిద్ర లేదు..మంచం మీద అటూ ఇటూ దొర్లుతూనే ఉన్నాను.. తెల్లవారుజామున రెండు గంటలు నిద్రపోయానంతే..

..కంటి నిండా నిద్రపోయి చాన్నాళ్లయింది .. ఏమయ్యిందో ఏంటో..

ఈమధ్య మాత్ర వేసుకున్నా నిద్ర పట్టడం లేదు. .

ఇలాంటి మాటలు చాలామంది నుంచి తరచూ వింటుంటాం. ఇటీవల కాలంలో నిద్రలేమితో బాధపడుతున్నవారి సంఖ్య ఎక్కువైంది. వయసుతో సంబంధం లేకుండా 80 శాతం మంది అనారోగ్య సమస్యలకు కారణం సరైన నిద్ర లేకపోవడమేనంటున్నారు వైద్యనిపుణులు. సగటున రోజుకు ఏడు గంటల సేపు నిద్ర పోకున్నా, సక్రమంగా నిద్ర పట్టడం లేదన్నా అనారోగ్య సమస్యలకు దగ్గరవుతున్నారని సంకేతమంటున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



కునుకే బంగారమాయెనె..

- పెరుగుతున్న నిద్రలేమి బాధితులు
- ఒత్తిళ్లు, నిరంతర ఆలోచనలతో సతమతం
- అదేపనిగా మొబైల్ ఫోన్ చూడటమూ కారణమే
- నిద్ర దూరమైతే అనారోగ్యం దగ్గరవుతున్నట్టే

ప్రస్తుత రోజుల్లో చాలామంది నిద్రలేమితో బాధపడుతున్నారు. వివిధ సమస్యలతో ఒత్తిళ్ల ఎదుర్కొంటున్న చాలామంది కంటి నిండా కునుకు తీయలేకపోతున్నారు. మంచం ఎక్కినా నిరంతర ఆలోచనలతో నిద్రకు దూరమవుతున్నారు. ఈతరహా బాధితులు పెరుగుతున్నారని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. తమ వద్దకు వస్తున్న రోగుల్లో వీరి సంఖ్య పెరుగుతోందంటున్నారు. దీనికితోడు అన్ని వర్గాల వారూ మొబైల్ ఫోన్లలో మునిగి తేలుతున్నారు. క్షణం ఖాళీ దొరికినా సెల్ చూస్తున్నారు. రాత్రివేళ కూడా దీంతోనే కాలక్షేపం చేస్తున్నారు. పగటి పూట కొంత పర్వాలేదు గాని రాత్రిళ్లు దీని ప్రభావ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిద్రపోయే ముందు కళ్లు తీవ్ర ఒత్తిడికి గురైతే సక్రమంగా నిద్ర పట్టదు. చీకట్లో సెల్‌ఫోను చూడటం వల్ల ఆ ప్రభావం మూడింతలవుతోంది. దీంతో కళ్ల కింద నలుపు, వాపు పెరిగి మానసిక సమస్యలు తలెత్తుతాయి. నిద్ర తక్కువైతే జ్ఞాపక శక్తి తగ్గుతుంది. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.

నిద్ర తక్కువైతే ప్రమాదం



నిద్ర పిల్లలకు, పెద్దలకు ఎంతో అవసరం. ఆరోగ్యంలో దీని ప్రభావం చాలా ఎక్కువ. పదేళ్ల లోపు చిన్నారులు రోజుకు 8-10 గంటలు నిద్రపోవాలి. లేదంటే ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. చిన్నతనంలోనే దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. క్రమంగా జ్ఞాపక శక్తి తగ్గిపోతుంది. రాత్రిళ్లు సెల్‌ఫోన్లు ఇవ్వడం వలన నిద్ర తక్కువై ఆ ప్రభావం మొదట్లోనే కళ్లపైనే చూపుతుంది. తరువాత ఊబకాయం, చర్మవ్యాధులు, నరాల సమస్యలు తలెత్తుతాయి. పెద్దలకు కూడా రోజుకు ఏడు గంటల నిద్ర లేకపోతే శారీరక, మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. గుండె జబ్బు, రక్తంలో ఆక్సిజన్ స్థాయి తగ్గడం, రోగ నిరోధక వ్యవస్థ దెబ్బతినడం, దీర్ఘకాలిక వ్యాధులకు దగ్గరవుతారని పరిశోధనలు కూడా చెబుతున్నాయి.

- డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగాధిపతి, రుయాస్పత్రి



నిద్రపోకుండా ఇలా సెల్‌ఫోన్ చూడటం ప్రమాదకరం

సుఖ నిద్రకు ఇలా చేస్తే మంచిది

మానసిక సమస్యలతో ఆస్పత్రికి వచ్చే వారిలో చాలా మంది నిద్ర సక్రమంగా పట్టనివారే. శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో మానసిక దృఢత్వానికి నిద్ర కూడా అంతే అవసరం. నిద్రకు 2-3 గంటల ముందు భోజనం ముగించాలి. సులువుగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. పాలు, తక్కువ కొవ్వు ఉండే పదార్థాలు తీసుకోవడం మంచిది. నిద్రకు ముందు కెఫిన్, ఆల్కహాల్‌ను నివారించాలి. సెల్‌ఫోన్లు, టీవీలను చూడకూడదు. పడుకునే గది చల్లగా, ప్రశాంతంగా, చీకటిగా ఉండేలా చూసుకోవాలి. బెడ్ మీదకు చేరాక కాస్సేపు పుస్తకాలు చదవడం, స్నానం చేయడం, ఇష్టమైన సంగీతం వినడం చేయాలి. ఆరోజు జరిగినవన్నీ పడుకునేముందు మననం చేసుకోకూడదు. పడుకున్న 20 నిముషాలకూ నిద్రరాకపోతే ఆరు బయటకు వెళ్లి విశ్రాంతినిచ్చే చిన్నపనులు చేస్తే నిద్ర పడుతుంది.

- డాక్టర్ మానస, మానసిక వైద్య నిపుణురాలు, రుయాస్పత్రి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టు మెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.56 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 51,148

తలనీలాలు సమర్పించినవారు: 21,236

ప్రాణం తీసిన వేగం

- ఆగివున్న లారీని ఢీకొన్న బైక్.. హోసూరు యువకుడి మృతి

పెళ్లకూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ ఆగివున్న లారీని ఢీకొనడంతో హోసూరు పట్టణానికి చెందిన యువకుడు దుర్మరణం చెందిన ఘటన పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలు... తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా హోసూరు పట్టణానికి చెందిన అప్పునూ, భారతి దంపతుల కుమారుడు ప్రదీప్ అప్పునూ(27) జర్మనీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. హోసూరు పట్టణంలో ప్రదీప్ ఇంజినీరింగ్ కంపెనీ పేరుతో పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. జర్మనీలో తనతో పాటు ఇంజనీరింగ్ చదివిన స్నేహితుడి వివాహం శుక్రవారం రాత్రి విజయవాడలో జరుగనుంది. మిత్రుడి వివాహానికి హాజరయ్యేందుకు గురువారం రాత్రి 10.30 గంటలకు బజాజ్ 400సీసీ బైక్‌పై హోసూరు నుంచి విజయవాడకు బయలుదేరాడు. పెళ్లకూరు మండలంలోని పెన్నేపల్లి వద్ద 71వ జాతీయ రహదారిపై ఆగివున్న లారీని వేగంగా ఢీకొని డివైడర్‌కు అమర్చిన ఇనుప చువ్వలకు మధ్యలో ఇరుక్కుపోయిన ప్రదీప్ అప్పునూ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రదీప్ అప్పునూ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, హెల్మెట్ ధరించి ఉన్నా తలకు తీవ్ర గాయాలై మృతి చెందడంతో బైక్ వేగాన్ని అంచనా వేయలేకపోతున్నట్టు ఎస్ఐ నాగరాజు చెప్పారు.



ప్రదీప్ అప్పూ (ఫైల్‌ఫొటో) - లారీ, ఇనుప ఊచల మధ్య ఇరుక్కు పోయిన బైక్



ఎందుకింత నిర్లక్ష్యం?

- లస్కర్ల నియామకంలో అంతులేని జాప్యం
- మూడేళ్ల నుంచి వారు లేకుండానే సాగు
- నీరు లేక రెండేళ్ల క్రితం 20 టీఎంసీలు వృథా
- రానున్న సీజన్‌లోనూ పొంచి ఉన్న ప్రమాదం
- ఈ దఫానైనా ఉన్నతాధికారులు కరుణిస్తారా!?

నెల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మారింది.. ప్రజాప్రతినిధులు మారారు.. ఆఖరికి అధికారులు కూడా కొత్తవారు వచ్చారు.. కానీ రైతుల సమస్య మాత్రం కొలిక్కిరాలేదు. గడిచిన మూడేళ్ల నుంచి లస్కర్లు లేక కాలువలపై నీటి యాజమాన్యం చాలా ఇబ్బందిగా మారుతోంది. బ్రిటీషు కాలం నుంచి లస్కర్ల వ్యవస్థ జిల్లాలో సాఫీగా నడుస్తుండగా వైసీపీ ప్రభుత్వం వచ్చి నాశనం చేసింది. 2022 తర్వాత లస్కర్ల నియామానికి అనుమతులు ఇవ్వలేదు. అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా, వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదు. దీని పుణ్యమా అని రూ.వేల కోట్ల విలువైన నీరు లస్కర్ల లేని కారణంగా దుర్వినియోగమైంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా తొలి జడ్పీ సమావేశంలోనే ఈ లస్కర్ల సమస్యపై ఎమ్మెల్యేలు గళం విప్పారు. ఇది జరిగి ఏడు నెలలు గడిచినా సమస్య కొలిక్కి రాలేదు. జిల్లాస్థాయి ఇరిగేషన్ అధికారులు సకాలంలో, సరైన విధంగా ప్రతిపాదనలు పంపడంలో విఫలమవుతుంటే.. రాష్ట్రస్థాయిలో ఉన్న ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఈ ప్రతిపాదనలను ఆమోదించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

రానున్న సీజన్ కీలకం

గతేడాది ప్రకృతి సహకరించడం, ప్రభుత్వ ముందుచూపుతో ప్రాజెక్టుల్లోకి పుష్కలంగా నీరు చేరడంతో ప్రస్తుత రబీ సీజన్‌లో పూర్తి ఆయకట్టుకు నీటి కేటాయింపులు జరిపారు. సోమశిల ప్రాజెక్టు కింద 5.50 లక్షల ఎకరాలు, కండలేరు కింద 2.26 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు జరుగుతోంది. ఈ పంట ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. ఈ నెలాఖరుతో దాదాపుగా వరి కోతలు పూర్తవుతాయని అంచనా. ఏప్రిల్ నుంచి రెండో పంట మొదలవుతుంది. అయితే ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వలను బట్టి చూస్తే రానున్న సీజన్ చాలా కీలకంగా మారనుంది. మొదటి పంట మాదిరిగా రెండో పంట సమయంలో పూర్తి ఆయకట్టుకు నీరు అందించడం సాధ్యపడదు. సోమశిల, కండలేరుల కింద 4-5 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందించగలరు. అప్పుడు నీటి యాజమాన్యం చాలా కీలకంగా మారుతుంది. ఒక కాలువ కింద కొంత ఆయకట్టు వరకే నీటి కేటాయింపులు జరిపినా క్షేత్రస్థాయిలోకి వచ్చే సరికి రైతులు అవేవీ పట్టించు కోకుండా సాగు చేసేస్తుంటారు. వీరిని నిలువరించ కుండా నీటిని వదిలేస్తే చివరకు రైతులంతా నష్టపోతారు. ఇక్కడ లస్కర్ల పాత్ర చాలా ముఖ్యం. కాలువల కింద నిర్దేశిత ఆయకట్టుకు మించి సాగు చేయకుండా అవగాహన కల్పించడంలోనూ, నీరు వృథా కాకుండా ఆయకట్టు రైతులకు మాత్రమే అందించడంలో లస్కర్లు కీలకంగా ఉంటారు. నీటి యాజమాన్యం సక్రమంగా చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. రెండేళ్ల క్రితం ఇదే రెండో పంట సీజన్లో లస్కర్లు లేని కారణంగా నీటి యాజమాన్యం సక్రమంగా జరగక 20 టీఎంసీల వరకూ నీరు వృథా అవ్వడం గమనార్హం.



సీజన్‌కు రూ.1.2 కోట్లు ఇవ్వలేరా?

చెరువులు, కాలువల నుంచి నీటిని అవసరం మేరకు చివరి ఆయకట్టు వరకూ విడుదల చేయడంలో క్షేత్రస్థాయిలో లస్కర్లు కీలక పాత్ర పోషిస్తుంటారు. వీరు కాలువలపై తూములు, చెక్కలను అవసరం మేరకు ఎత్తుతూ, దించుతూ ఉంటారు. ఇంతటి కీలకమైన లస్కర్లను గత ప్రభుత్వం పెండింగ్ వేతనాలు కూడా చెల్లించకుండానే తొలగించింది. అప్పటివరకూ జిల్లాలో 230 లస్కర్లు పనిచేస్తున్నారు. వీరికి ఒక సీజన్‌కు ఐదు నెలలు మాత్రమే నెలకు రూ.10,500 చొప్పున వేతనం చెల్లిస్తుంటారు. ఈ లెక్కన ఒక సీజన్‌కు రూ.1.20 కోట్లు మాత్రమే లస్కర్లకు ఖర్చవుతుంది. అయితే వీరు సక్రమమైన నీటి యాజమాన్యం ద్వారా అంతకన్నా అనేక రెట్లు విలువైన నీటిని పొదుపు చేయడంతోపాటు రైతుల ఇబ్బందులను తొలగిస్తుంటారు. అయినా లస్కర్ల నియామకంలో మాత్రం నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ప్రతి సీజన్‌లోనూ కాలువల్లో ఓఅండ్ఎం పనుల కోసం జిల్లాలో సుమారు రూ.30 కోట్ల వరకూ ఖర్చు చేస్తుంటారు. అయితే లస్కర్లకు మాత్రం రూ.1.20 కోట్లు ఇవ్వలేకపోతున్నారు. నిబంధనల ప్రకారం రైతుల నుంచి వసూలు చేసిన శిస్తు నగదుతో లస్కర్లను నియమించుకోవాల్సి ఉంది. కానీ చాలా కాలం నుంచి శిస్తు వసూళ్లు జరగడం లేదు. అయితే రైతుల ప్రయోజనాల దృష్ట్యా మరో హెడ్ కింద లస్కర్ల నియామకానికి అనుమతులు ఇచ్చే అవకాశం ఉన్నా ఆలోచన చేయడం లేదు. మరి రానున్న సీజన్‌కైనా లస్కర్ల నియామకానికి రాష్ట్ర ఉన్నతాధికారులు కరుణిస్తారో.. లేదో.. చూడాలి.

అడుగుతూనే ఉన్నాం

జిల్లాలో లస్కర్ల నియామకానికి గత సీజన్‌కు ముందే ప్రతిపాదనలు పంపాం. అయితే వారిని నియమించుకునే హెడ్ కింద ఫండ్ లేకపోవడంతో అనుమతులు రాలేదు. తర్వాత మరో హెడ్ కిందనైనా అనుమతులు ఇవ్వాలని అడుగుతున్నాం. రానున్న సీజన్‌కు సంబంధించి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

- దేశా నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ

వామ్మో.. స్కూళ్లలో సెగలు

- నేటి నుంచి ఒంటిపూట బడులు
- చెట్ల కింద తరగతులు నిర్వహిస్తే చర్యలు
- ఏప్రిల్‌లో 2వ శనివారం పనిదినం

నెల్లూరు (విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత ఈ ఏడాది ముందుగానే మొదలైంది. గత పది రోజులుగా భారీ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం, సాయంత్రం మినహా ఎవరూ బయటకు రావడం లేదు. మధ్యాహ్నం పూట రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. కానీ బడి పిల్లలు మాత్రం బయటకు వెళ్లక తప్పడంలేదు. కాలినడకన, సైకిళ్లమీద బడికి వెళ్లే గ్రామీణ విద్యార్థులు ఎండలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ ఒంటిపూట బడులను ప్రకటించింది. సోమవారం నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్న తరుణంలో శనివారం నుంచే 1 తరగతి నుండి 9వతరగతి వరకు అన్ని ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలన్నీ ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలని ఆదేశాలను జారీ అయ్యాయి. టెన్త్ పరీక్షలు జరిగే పాఠశాలలు మాత్రం మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు.

పాఠశాలలకు సూచనలు

అన్ని మేనేజ్‌మెంట్ల పాఠశాలలకు విద్యాశాఖ పలు సూచనలు జారీ చేసినట్లు డీఈఓ ఆర్.బాలాజీ రావు తెలిపారు. విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్‌ను అనుసరించి పాఠశాల సమయాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఏప్రిల్ నెలలో రెండో శనివారాన్ని పనిదినంగా పరిగణించాలని, అన్ని పాఠశాలల్లో మంచినీటిని ఏర్పాటు చేసుకోవడంతో పాటు శుద్ధి యంత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాలు, చెట్లకింద తరగతులు నిర్వహించకూడదన్నారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, భోజనం అందించాకే విద్యార్థులను ఇళ్లకు పంపించాలని ఆదేశించారు. అదేవిధంగా వేసవి తాపానికి ఎవరైనా గురైతే వెంటనే వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో వైద్య పరీక్షలు చేపట్టడంతోపాటు పాఠశాల పరిసరాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సంబంధిత హెచ్ఎంలు వీటన్నిటిపై దృష్టి సారించాలని ఆదేశించారు.

బీమా.. పాడిరైతుకు ధీమా!

- జిల్లాకు రూ.15 లక్షలు విడుదల
- ఒకసారి చేయిస్తే మూడేళ్ల వరకు వర్తింపు

జిల్లాలో వ్యవసాయం తరువాత పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్న పశుపోషకులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. పశు బీమా నమోదుకు చర్యలు చేపట్టడంతో పాటు తన వాటా కింద జిల్లాకు రూ.15లక్షలు విడులయ్యాయి. ఒకసారి పశుబీమా చేయించుకుంటే మూడేళ్ల వరకు వర్తిస్తుందని పశుసంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు.

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 57,774 తెల్ల పశువులు, 6,46,088 నల్ల పశువులు, 10,95,197 గొర్రెలు, 1,86,929 మేకలు, 2,969 పందులు ఉన్నాయి. గత వైసీపీ హయాంలో పశునష్ట పరిహారం పథకం తీసుకొచ్చినా పాడిరైతులకు పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. పశువులు అనారోగ్యానికి గురై జబ్బు చేసి చనిపోతే పాడిరైతులు ఎంతో నష్టపోతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం బీమాపై దృష్టి సారించింది. ప్రభుత్వం కొంత ప్రీమియం చెల్లించడంతోపాటు పాడిరైతు కొంత మేర చెల్లింపులు చేయడం ద్వారా ఆ నష్టం నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉండేలా కార్యాచరణ రూపొందించింది. గతేడాది దాదాపు రూ.15.8లక్షలు మంజూరు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మృతి చెందిన పశువులకు కూడా ఇటీవల పరిహారం అందించారు. తాజాగా మరోసారి రూ.15లక్షలు మంజూరయ్యాయి.

ఆవు, గేదె జాతి పశువులకు..

మేలు జాతి పశువుకు రూ.30వేలు, నాటు పశువుకు రూ.15వేలు, ఒకటిన్నర సంవత్సరంపైబడిన మేలుజాతి ఎద్దులు, దున్నలకు రూ.30వేలు, రెండేళ్ల పైబడిన నాటు ఎద్దులు, దున్నలకు రూ.15వేలు బీమా వర్తిస్తుంది. ఇందులో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీలకు 80శాతం రాయితీ లభిస్తుంది. అంటే రూ.30వేల బీమాకు ప్రభుత్వ రాయితీ రూ.1536 కాగా లబ్ధిదారుడి ప్రీమియం రూ.384. అదేవిధంగా రూ.15వేల బీమాకు ప్రభుత్వ రాయితీ రూ.768, లబ్ధిదారులు రూ.192 చెల్లించాలి. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న పాడిరైతులకు 50శాతం రాయితీ అందుతుంది.



గొర్రెలు, మేకలు, పందులకు..

6నెలలు ఆపైన వయసు కలిగిన గొర్రెలు, మేకలు, పందులకు ఒకదానికి రూ.6వేలు బీమా వర్తిస్తుంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీలకు 80 శాతం రాయితీ లభిస్తుంది. ప్రభుత్వ రాయితీ రూ.300, లబ్ధిదారుని ప్రీమియం రూ.75. దారిద్ర్యరేఖకు ఎగువ ఉన్నవారికి 50శాతం రాయితీ అందుతుంది.

మూడేళ్ల వరకు వర్తింపు

జిల్లాలో పశుబీమా నమోదు జరుగుతోంది. ఒకసారి బీమా చెల్లిస్తే మూడేళ్ల వరకు వర్తిస్తుంది. 80 శాతం రాయితీ పొందాలనుకునే లబ్ధిదారులు బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డులతో పాటు రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకుని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలి

- రమేష్‌నాయక్, పశుసంవర్థక శాఖ జేడీ

కోళ్ల వ్యాన్ బోల్తా: ఇద్దరికి గాయాలు



జాతీయ రహదారిపై రింగ్ రోడ్డు సమీపంలో బోల్తా పడిన వ్యాన్

నాయుడుపేట టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కోళ్ల లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి నుంచి గూడూరు వైపు కోళ్ల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ నాయుడుపేట శివారులోని జాతీయ రహదారి రింగ్ రోడ్డు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న వినాయక, రవికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి



కోళ్లమిట్టలో ఓ ఇంటి ముందు చుక్కల దుప్పి

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం కోళ్లమిట్ట ప్రాంతంలోకి చుక్కల దుప్పి వచ్చింది. కోళ్లమిట్టలోని ఓ ఇంటి పరిసరాల్లో తిరుగుతున్న జింకను గమనించిన స్థానికులు వన్యప్రాణి సంరక్షణ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడ నుంచి రాఘవయ్యపేట చెంగాళమ్మ ఆలయ వెనుకనున్న ఖాళీ ప్రదేశంలోకి దుప్పి వెళ్లింది. స్థానికుల సహకారంలో వన్యప్రాణి సంరక్షణ అధికారులు దుప్పిని పట్టుకొని ప్రత్యేక వహనంలో తీసుకెళ్లారు. తాగునీటి కోసం జనారణ్యంలోకి వచ్చి ఉంటుందని వన్యప్రాణి సంరక్షణ అధికారులు చెప్పారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి



గురుకులంలో విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

కోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలని ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ చైర్మన్ యాకశిరి వెంకటేశ్వర్లు కోరారు. మండల పరిధిలోని చిట్టేడు యానాదుల గురుకులం, కోటలోని యానాదుల బాలికల గురుకులాల్లో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ వితరణతో పరీక్షా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేషవర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


27న పరిగ్రాహ్ సాంకేతిక సదస్సు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 27వ తేదీన పరిగ్రాహ్ 2కే25 జాతీయస్థాయి సాంకేతి సదస్సు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరై పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్ ఇవ్వడంతో పాటు టెక్నికల్ క్విజ్ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, డాక్టర్ బీశ్రీనివాస్, డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మనిషిని మంచి మార్గంలో నడిపేదే
గొప్ప సాహిత్యం
తమసోమా జ్యోతిర్గమయ పుస్తకావిష్కరణ సభలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహిత్యవేత్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మనిషిని మంచి మార్గంలో నడిపించేదే చరిత్రలో గొప్ప సాహిత్యంగా నిలుస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. కవి తోట వేంకటేశ్వర్లు రాసిన 'తమసోమా జ్యోతిర్గమయ' కవితా సంపుటి ఆవిష్కరణ సభను యూత్ హాస్టల్లో శుక్రవారం నిర్వహించారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి సుకృతానంద, సాహిత్యవేత్తలు ఎస్డీడీ చంద్రశేఖర్, గార్లపాటి దామోదరనాయుడు, మేడిపల్లి రవికుమార్ పాల్గొని మాట్లాడారు. సమాజం పట్ల మంచి దృష్టి కలిగిన కవిగా తోట వేంకటేశ్వర్లు సహజమైన రీతిలో మంచి కవిత్వాన్ని రాశారని తెలిపారు. శ్రీశ్రీ వంటి కవుల ప్రభావం కవిగా తోట వేంకటేశ్వర్లులో ఉందన్నారు. కవితలన్నింటినీ కలిపి పుస్తకంగా తీసుకురావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఇదే ఉత్సాహంతో కవిత్వం రాసి, మరిన్ని పుస్తకాలు వెలువరించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత తోట వేంకటేశ్వర్లును పలువురు సత్కరించారు. సభలో ఎన్.ధర్మయ్య, బొందు రామచంద్రారెడ్డి, నడ్డి నారాయణ పాడిన పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పలువురు సాహిత్యవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరత్‌శర్మ ప్రవచనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (విశ్వవిద్యాలయాలు): వేద వాఙ్మయంలో లక్ష్మీదేవి మహాత్మ్యంపై అవధాని ఉప్పలధడియం భరత్‌కుమార్‌శర్మ చేసిన ప్రవచనం ఆకట్టుకుంది. టీటీడీ దివ్య ఆళ్వార్ ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళా మందిరంలో లక్ష్మి జయంతి సందర్భంగా చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీసూక్తంతో లక్ష్మీదేవి అనుగ్రహం పొందగలమన్నారు. హోలీ సందర్భంగా లక్ష్మీదేవి లీలలను వివరించడం మంచి అనుభూతి కలిగిస్తోందన్నారు. భరత్‌కుమార్‌శర్మను రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథరెడ్డి, చిగోర ఆధ్యాత్మిక కేంద్రం అధ్యక్షుడు హనుమంతరావు సత్కరించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

కోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు వద్ద శుక్రవారం మోటరు బైక్ ఢీకొనడంతో వెంకయ్య(85) మృతి చెందాడు. చిట్టేడు గ్రామానికి చెందిన వెంకయ్య ఉదయం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా అన్నంబాక గ్రామానికి చెందిన జగదీష్ మోటరు బైక్‌పై వెళ్తూ ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడ్డ వెంకయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

16న ఉచిత వైద్య శిబిరం

కోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ సాయిబాబా మందిరం వద్ద ఈనెల 16వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నెల్లూరుకు చెందిన సుశీల నేత్రాలయ నిర్వాహకుడు డాక్టర్ సుధాకరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 10నుంచి 3 గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరానికి వచ్చేవారు ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ కార్డు, ఆధార్ కార్డుతో తీసుకురావాలని సూచించారు. వివరాలకు 9704466171 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

ఓజిలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నుంచి అన్ని పాఠశాలల్లో మధ్యాహ్నం వరకే తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈవో శైలజ తెలిపారు. ఉదయం 7.45నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. మండలంలోని 55 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 5 ఉన్నత, రెండు గురుకులాలతో పాటు ప్రైవేటు పాఠశాలలూ ఇదే సమయాన్ని పాటించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టి ఇళ్లకు పంపేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో పేర్కొన్నారు.

మహాలక్ష్మీదేవి గ్రామోత్సవం



ఉచ్చూరువారిపాళెంలో ఊరేగుతున్న అమ్మవారు

కోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉచ్చూరువారిపాళెం గ్రామదేవత చతుర్భుజ మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. ఐదు రోజులపాటు జరిగిన అమ్మవారి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ధ్వజారోహణం, శాంతి హోమాలు జరిగాయి. అమ్మవారు ఊరేగుతున్న సమయంలో భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఎన్ఎంయూ ఆధ్వర్యంలో నిరసన

గూడూరు అర్బన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన నాలుగో రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నాలుగు రోజులుగా నిరసన తెలుపుతున్నా డిపో మేనేజర్ స్పందించడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



చిల్లకూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి హోమ పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా ఆలకరించి పల్లకీ సేవ జరిపారు. భక్తులు అమ్మవారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎస్వీయూలో జర్మన్ భాష అభ్యసన కేంద్రం
స్టడీ వింగ్స్ ప్రతినిధులతో అధికారుల సమావేశం



సమావేశంలో ఇరు సంస్థల ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (విశ్వవిద్యాలయాలు): ఎస్వీయూలో జర్మన్ భాష అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా స్టడీ వింగ్స్ సంస్థ ప్రతినిధుల బృందం వర్సిటీ అధికారులతో శుక్రవారం సమావేశమైంది. ఇరు సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ జర్మనీలో విద్యా, ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఇవి పొందాలంటే జర్మన్ భాష నేర్చుకోవాలన్నారు. ఇందుకోసం యూనివర్సిటీలో జర్మన్ భాష అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, జర్మన్ స్టడీ వింగ్స్ ప్రతినిధులు నరేంద్రరెడ్డి, సుకన్య పాల్గొన్నారు.

అర్హతలేని సంస్థకు
సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం కేటాయింపా..?

తిరుపతి(విద్య), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే బాలికలకు స్వీయరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్)పై శిక్షణ ఇచ్చే కాంట్రాక్టు అర్హతలేని సంస్థకు కేటాయించడం సరికాదని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యు.నాగేశ్వరరావు అన్నారు. ఎమ్మార్‌పల్లెలోని సంఘ కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ మ్యాన్ పవర్ ఏజెన్సీని నడిపే సంస్థకు స్వీయరక్షణ శిక్షణ కోసం వర్క్ ఆర్డర్ ఇవ్వడం దారుణమన్నారు. ఇదేసంస్థ నంద్యాల జిల్లాలో దరఖాస్తు చేసుకుంటే అర్హత లేదని ఇవ్వలేదని ఆరోపించారు. దీనిపై జిల్లా అధికారులు పునరాలోచించాలని కోరారు.

22ఏ భూములకు విముక్తి కల్పించండి

తిరుపతి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో చాలాచోట్ల నివాసిత ప్రాంతాలను నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చారని, వాటికి విముక్తి కల్పించాలని జిల్లా ఇన్‌చార్జి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కార్పొరేటర్లు కోరారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ నేతృత్వంలో విజయవాడలోని మంత్రి కార్యాలయంలో కార్పొరేటర్లు కలిశారు. గతంలో అనేకసార్లు లావాదేవీలు జరిగిన ఆస్తులు కూడా 22ఏలోకి వెళ్లిపోయాయని, నిషేధం ఎత్తివేసి క్రయ విక్రయాలకు అవకాశం కల్పించాలని కోరారు.





నాయుడుపేట సమీపంలో విన్నమాల వద్ద నిర్మించిన రింగ్ రోడ్డు - పెళ్లకూరు మండలం చిల్లకూరు వద్ద కాంతులు విరజిమ్ముతున్న ఎల్ఈడీ లైట్లు

రయ్... రయ్

- నాయుడుపేట - రేణిగుంట నడుమ సిక్స్ లేన్
- పూర్తయిన జాతీయ రహదారి పనులు
- గంటకు తగ్గిన ప్రయాణ సమయం

నాయుడుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట 71వ జాతీయ రహదారి పనులు పూర్తయ్యాయి. నాయుడుపేటలోని చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారి నుంచి రేణిగుంట వరకు 57 కిలో మీటర్ల పొడవున్న ఈ మార్గాన్ని రూ.1931 కోట్ల వ్యయంతో సిక్స్ లేన్‌గా మార్చారు. నిర్మాణ పనులు దాదాపు పూర్తవడంతో అనధికారికంగా వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల, తిరుపతి పుణ్యక్షేత్రాలతో పాటు శ్రీకాళహస్తి, కాణిపాకం, కాంచీపురం, తిరుత్తణి, తిరువళ్లూరు, శ్రీపురం, తిరువణ్ణామలై లాంటి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలకు వెళ్లే మార్గం రెండు లేన్‌లుగా ఉండేది. వాహనాల రద్దీ పెరగడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకునేవి. దీంతో నాయుడుపేట - తిరుపతి నడుమ ప్రయాణించాలంటే వాహనచోదకులు, ప్రజలు భయాందోళన చెందేవారు. ఈ నేపథ్యంలో సిక్స్ లేన్‌గా విస్తరించడానికి కేంద్ర ప్రభుతం 2020లో శ్రీకారం చుట్టింది. ఆ మేరకు రూ.1931 కోట్లు మంజూరు చేసింది. కాంట్రాక్టు దక్కించుకున్న మేఘా ఇంజినీరింగ్ సంస్థ 2022లో పనులు ప్రారంభించింది. నెల్లూరు, చెన్నై, శ్రీకాళహస్తి, తిరుపతి, బెంగళూరు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలు నేరుగా వెళ్లేలా నాయుడుపేట మండలం విన్నమాల వద్ద చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారిపై రింగ్ రోడ్డు నిర్మించారు. అలాగే నాయుడుపేట, పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు, చావాలి, చిల్లకూరు, పెళ్లకూరు, టెంకాయతోపు, నెలబల్లి, తొట్టంబేడు మండలంలోని పొయ్య, శింగమాల, శ్రీకాళహస్తి బైపాస్, స్వర్ణముఖినది, ఊరందూరు, గున్నేరి, తొండమనాడు, కొత్తచెరువు, ఏర్పేడు, మల్లవరం తదితర గ్రామాల వద్ద వంతెనలు, అండర్ పాస్‌లతో పాటు శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట వద్ద బైపాస్‌లు నిర్మించారు. రహదారికి ఇరువైపులా గ్రామాలున్న చోట అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లు నిర్మించి దాదాపు 1500 ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. ఏర్పేడు సమీపంలో టోల్‌ప్లాజా నిర్మించారు. అయితే నాయుడుపేట గోమతి సెంటర్, పెళ్లకూరు మండలంలోని తాళ్వాయిపాడు, చావాలి, గుర్రప్పతోట, చిల్లకూరు, టెంకాయతోపు, అక్కగారిపేట గ్రామల వద్ద సర్వీస్ రోడ్లు పూర్తి కాకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు పనులు పూర్తవడంతో ఇటీవల రాకపోకలను అనుమతించారు. దీంతో వాహనాలు రయ్ రయ్ మంటూ పరుగులు తీస్తూ సుమారు గంట సమయంలోనే తిరుపతికి చేరుకుంటున్నాయి. గతంలో రెండు గంటలకు పైగా ప్రయాణించాల్సి ఉండగా ప్రస్తుతం గంట సమయంలో వెళ్లిపోతుండడంతో వాహన చోదకులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెంగాళమ్మ ఆలయంలో మహాచండీయాగం

సూళ్లూరుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా మహాచండీ యాగం నిర్వహించారు. అదేవిధంగా టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడి ఆలయంలో అభిషేకం చేశారు. స్వామివారిని పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, చిట్టేటి పెరుమాల్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

గూడూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు ఇన్‌చార్జి డీవైఈవో, ఎంఈవో-1 సనత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 17నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. గూడూరు పట్టణంలో జడ్పీ బాలుర, బాలికల, జీఎస్ఆర్ మున్సిపల్, సీఎస్ మున్సిపల్, చెన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీస్, వివేకానంద, నారాయణ పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, మొత్తం 1405 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులు అర గంట లోపే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సనత్‌కుమార్ సూచించారు.

అళఘునాథస్వామికి ప్రత్యేక పూజలు



మోహినీ అలంకారంలో అళఘునాథస్వామి

గూడూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అళఘునాథస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారిని మోహినీ అవతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ జయంతి సందర్భంగా భక్తులు సామూహిక కుంకుమార్చన పూజలు జరిపారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.

హరియాణా గవర్నర్‌ను కలిసిన కొమారి



దత్తాత్రేయకు శ్రీకృష్ణుడి ప్రతిమ అందజేస్తున్న కోటేశ్వరరావు

కోట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణానికి చెందిన శ్రీభారత్ ట్రస్టు చైర్మన్ కొమారి కోటేశ్వరరావు శుక్రవారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిశారు. దత్తాత్రేయ శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరించారు.

అన్నదానం

నాయుడుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణానికి చెందిన బిరదాల వెంకటమణి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు సురేష్, రమ దంపతులు శుక్రవారం స్థాని మేరీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకులు సునీత, బెన్నీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మునిదీప్, నందిత, సుమతి, శ్రీలక్ష్మి, వేణుగోపాల్, శ్రీనివాస్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మసీదుల వద్ద పోలీసు బందోబస్తు



జామియా మసీదు వద్ద పోలీసు బందోబస్తు

సూళ్లూరుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోలి పండగ నేపథ్యంలో ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మానాయుడు ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలోని అన్ని మసీదుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. హోలి సంబరాల నేపథ్యంలో ముస్లిం లకు పవిత్రమైన రంజాన్ మాసంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అక్బరియా మసీదు, జామియా తదితర మసీదుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.

సూర్యప్రభ వాహనంపై వేణుగోపాలుడు



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలుడు

సూళ్లూరుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మంగళంపాడులోని సౌందర్య వల్లీ రుక్మిణీ సత్యభామ గోదా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం వేణుగోపాలుడు సూర్యప్రభ వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. ఆలయ ప్రధాన అర్చకులు శెల్వంస్వామి ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామి వారిని కొలువుదీర్చారు. ఉభయకర్తలుగాఎలింబేటి వీరాస్వామి మొదలి, ఎస్.మునస్వామి మొదలి వ్యవహరించారు

ఉత్సాహంగా హోలీ సంబరాలు



సూళ్లూరుపేటలో రంగులు చల్లుకుంటున్న యువకులు

సూళ్లూరుపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో హోలీ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం ఉదయం నుంచే చిన్న, పెద్ద, ఆడ, మగ అందరూ ఒకరినొకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు హోలి పండుగను విభేదాలను మరిచి అందరూ ఆనందకేళీగా జరుపుకున్నారు.

ఓజిలి: మండలంలోని కురుగొండ, మానమాల, ఓజిలి, ఆరిమేనిపాడు, అత్తివరం, రాచపాళెం తదితర గ్రామాల్లో హోలీ వేడుకలు జరిగాయి. యువకులు రంగులు చల్లుకుని కేరింతలు కొట్టారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని దర్గావీధిలో హోలీ వేడుకలు నిర్వహించారు. యువత, స్థానికులు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు.

తడ: హోలీ పండుగ పర్వదినాన్ని తడలో వేడుకగా జరుపుకున్నారు. ఉదయం నుంచే పిల్లలు, యువకులు రంగులు చల్లుకొంటూ గంతులేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్, కోట ప్రాంతాల్లో మార్వాడీలు హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ చిందులేశారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



రక్తదాన శిబిరం వద్ద జనసేన నాయకులు రమణ, మాబాషా, హేమంత్ శర్మ తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఆపార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నాయకులు ఆవుల రమణ, మాభాషా ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగరవేశారు. అన్నదానం చేశారు. ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హేమంత్ శర్మ, ఆవుల దాస్, నక్క హరిబాబు, శంఖు సురేష్, వల్లూరు రాజా, రేవంత్, సూరి, రామగిరి, పద్మజ, బీజేపీ నాయకురాలు బెజవాడ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అలిపిరి డిపో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 32వ బ్యాచ్‌కు హెవీడ్రైవింగ్ శిక్షణ ప్రారంభించారు. అంతకుముందు శిక్షణ పూర్తి చేసుకున్న 31వ బ్యాచ్‌కు సర్టిఫికెట్స్ అందజేశారు. కొత్తబ్యాచ్‌కు సోమవారం నుంచి తరగతులు జరగనున్నాయి. కార్యక్రమంలో డిపో మేనేజర్ హరిబాబు, అసిస్టెంట్ మేనేజర్లు పుష్పలత, ప్రభాకర్, రాము పాల్గొన్నారు.

వేదాల్లోని ఆయుర్వేద అంశాలను సమాజానికి తెలియజేసేందుకు కృషి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ డైరెక్టర్ జనరల్ నారాయణం శ్రీకాంత్ వేద వర్సిటీలో పర్యటించారు. వేద వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తితో సమావేశమయ్యారు. వేద విజ్ఞానంలోని ఆయుర్వేద సంబంధ అంశాలపై చర్చించారు. వేదాల్లోని ఆయుర్వేద అంశాలను సమాజానికి తెలియజేసేందుకు ఇరు సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయడానికి వచ్చారు. త్వరలో అవగాహన ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో వేద వర్సిటీ రిజిస్ట్రార్ భాస్కరుడు, డీన్లు గోలి సుబ్రమణ్యశర్మ, పవన్‌కుమార్, ఆయుర్వేద వైద్యులు మురళీకృష్ణ, ప్రొఫెసర్ రాధేశ్యామ్, ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఆయుర్వేద కేంద్రం ఏపీ అధ్యక్షుడు గోలి పెంచలప్రసాద్ పాల్గొన్నారు.